


# విజయభాను




విశాఖపట్నం, సోమవారం 20-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 67 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## అందరూ హిందీ నేర్చుకోవాలి

- తల్లి, జన్మభూమి, మాతృభాష, మాతృదేశాన్ని మరవొద్దు
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్ : దేశంలో ప్రతి పౌరుడు హిందీ భాష నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. అమీర్‌పేటలో ఆదివారం నిర్వహించిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ విశారద స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భాష భావాన్ని వ్యక్తీకరించేందుకు, మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాష నేర్చుకోవాలని.. మాట్లాడాలని సూచించారు.

తల్లి, జన్మభూమి, మాతృభాష, మాతృదేశాన్ని మరిచిపోవద్దని వెంకయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు.

దేశంలో హిందీ ఎక్కువగా మాట్లాడుతారని.. అర్థం చేసుకుంటారని అన్నారు. ఈ నేపథ్యంలో హిందీ భాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. 1935లో విజయ వాడలో దక్షిణ భారత హిందీ ప్రచారసభ స్థాపితమైందని, దీని ద్వారా అధ్యాపకులు, ప్రచారకులు తయారయ్యారని తెలిపారు.

హిందీ ప్రచార సభల వల్ల లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## గుజరాత్ ఎన్నికలకు ముందే అధ్యక్ష పీఠంపై రాహుల్

### నేటి సీడబ్ల్యూసీలో నిర్ణయం
### డిసెంబర్ 9 నుంచి గుజరాత్ ఎన్నికలు



దిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ పట్టాభిషేకానికి రంగం సిద్ధమైంది. ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారని కొన్ని రోజుల నుంచి వార్తలు వెలువడుతున్న విషయం తెలిసిందే. అయితే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే అధ్యక్ష బాధ్యతలను రాహుల్‌కు అప్పగించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై అధ్యక్ష ఎన్నికలపై స్పష్టతను ఇవ్వనుంది.

సోనియాగాంధీ నివాసమైన 10 జన్‌పథ్‌లో సోమవారం ఉదయం తరువాయి 2లో

## ప్రజాసంకల్పయాత్రకు బ్రహ్మరథం

### అన్నవస్తున్నాడంటూ జేజేలు
### వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. అన్నవస్తున్నాడంటూ జేజేలు చెబుతున్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 12వ రోజు ఆదివారం కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తున్నారు. తరువాయి 2లో



## 2019 ఎన్నికల తర్వాత వైకాపా కనుమరుగు

- అన్న సంజీవిని జనరిక్ మందుల దుకాణం ప్రారంభం
- కేసులనుండి బయటపడేందుకే పాదయాత్ర
- మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

గుంటూరు: సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్న వైఎస్ జగన్ అధికారంలోకి రావడం కల్ల అని, జైలుకెళ్లడం మాత్రం ఖాయమని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు పట్టణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సంజీవిని జనరిక్ మందుల దుకాణాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్ వాగ్ధానాలన్నీ నీటి తరువాయి 2లో



## భారీ అగ్ని ప్రమాదం.. 19 మంది మృతి




బీజింగ్ : చైనాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ ఇంట్లో చెలరేగిన మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించటంతో 19 మంది మృతి చెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ బిజీంగ్‌లోని దాక్సింగ్ జిల్లా.. జిన్‌జియాన్ గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది.

సాయంత్రం 6 గంటల సమయంలో ఓ ఇంట్లో మంటలు చెలరేగి చుట్టుపక్కల వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు మూడు గంటలపాలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఘటనలో మొత్తం 19 మృతదేహాలను సిబ్బంది తరువాయి 2లో

## అగ్రిటెక్ సదస్సుతో ఒరిగిందేమీ లేదు

- సదస్సుతో కార్పొరేట్ సంస్థలకే లబ్ధి
- కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి
- సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బీవీ రాఘవులు



విశాఖపట్టణం: విశాఖపట్టణంలో జరిగిన అగ్రిటెక్ సదస్సుతో సన్న, చిన్నకారు రైతులకు ఒరిగిందేమీ లేదని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కార్పొరేట్ తరువాయి 2లో

## ఇందిరాగాంధీకి ఘన నివాళి

హైదరాబాద్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. పీపుల్స్ ప్లాజాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, తరువాయి 2లో



## టేకిట్ ఈజీ



ఆగ్రోటెక్ సదస్సు విజయవంతమైనట్టా లేక విఫలమైనట్టా? ఒక్కొక్కరిది ఒక్కో అభిప్రాయం!!






# 'వందేమాతరం' కోసం దయాల్ సింగ్‌ను తక్కువ చేస్తారా?



న్యూఢిల్లీ: దేశరాజధానిలో దశాబ్దాల చరిత్ర, గుర్తింపు ఉన్న దయాల్ సింగ్ కాలేజీ పేరును 'వందేమాతరం' కాలేజీగా మార్చాలని కళాశాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ తప్పుపట్టారు. ఈవెనింగ్ కాలేజీ పేరును 'వందేమాతరం మహావిద్యాలయ'గా మార్చాలని ఢిల్లీ యూనివర్శిటీ దయాల్ సింగ్ కాలేజీ యంత్రాంగం శనివారం నిర్ణయం తీసుకుంది. దీనిపై షీలాదీక్షిత్ మాట్లాడుతూ, పాత కాలేజీకి పేరుమార్చడం కంటే కొత్త కాలేజీని కేంద్రం నిర్మించడం మంచిందని సూచించారు. 'దయాల్ సింగ్ కాలేజీకి దశాబ్దాల చరిత్ర ఉంది. మంచి గుర్తింపు ఉంది. దానికి కొత్త పేరు పెట్టాలనుకుంటే కొత్త కాలేజీ పెట్టి ఆ పేరు పెట్టుకోవచ్చు. అందువల్ల విద్యార్థులకు కూడా ఉపయోగం ఉంటుంది. కాలేజీ పేరు మార్చడం వల్ల ప్రభుత్వం ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటోందో నాకు తెలియదు' అని షీలా వ్యాఖ్యానించారు.

'వందేమాతరం' జాతీయగీతమని, అందరూ గౌరవిస్తారని, అయితే కాలేజీకి ఆ పేరు పెట్టడంలో హేతుబద్ధత లేదని ఆమె అన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అందరూ హర్షించేలా ఉండాలని పేర్కొన్నారు.

కాగా, దయాల్ సింగ్ కాలేజీ పేరు మార్పు నిర్ణయాన్ని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది తొందరపాటు నిర్ణయమని పేర్కొంది. పేరు మార్చాలన్న నిర్ణయం ద్వారా పంజాబ్ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు సర్దర్ దయాల్ సింగ్ మంజితియా జ్ఞాపకాలను తుడిచివేయాలనుకుంటున్నారని ఎన్స్‌యూఐ తప్పుపట్టింది.

# వీనస్ విలియమ్స్ ఇంట్లో భారీ దోపిడీ..

### 2.6 కోట్లు దోచుకెళ్లిన దుండగులు



ఫ్లోరిడా: అమెరికా టెన్నిస్ స్టార్, ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ చాంపియన్ అయిన వీనస్ విలియమ్స్ ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. సెప్టెంబరులో ఆమె యూఎస్ ఓపెన్‌లో ఆడుతూ ఇంటికి దూరంగా ఉన్న వేళ ఈ భారీ చోరీ జరిగింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. దోపిడీ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి ఐదో తేదీ మధ్య ఈ ఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. మొత్తం రూ.2.6 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురైందని అంచనా వేశారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత అంటే సెప్టెంబరు 7న 37 ఏళ్ల వీనస్ సెమీస్‌లో స్లొయెన్ స్టీవెన్స్ చేతిలో పరాజయం పాలైంది. అయితే సెమీస్‌కు చేరుకున్న ఆమె దాదాపు రూ.6 కోట్లు గెలుచుకుంది. ఆమె ఇంట్లో దొంగలు పడి దోచుకున్న దానికి ఇది రెండు రెట్లు అధికం కావడం గమనార్హం.

## మొదటి పేజీ తరువాయి

### అగ్రిటెక్ సదస్సుతో ఒరిగిందేమీ లేదు

సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే సదస్సు నిర్వహించారన్నారు. అలాగే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులకు చట్టరూపం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కల్పించలేని పారిశ్రామికరణతో ప్రయోజనంలేదని, ఆహార ఉత్పత్తులను పక్కనబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాఘవులు డిమాండ్ చేశారు.

### భారీ అగ్ని ప్రమాదం.. 19 మంది మృతి

వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు.. జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

కాగా, ప్రమాదం వెనుక అనుమానాలు వ్యక్తం చేస్తున్న పోలీసులు.. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

### గుజరాత్ ఎన్నికలకు ముందే అధ్యక్ష పీఠంపై రాహుల్

10.30 గంటలకు సీడబ్ల్యూసీ సమావేశం జరగనున్నట్లు సమాచారం. అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్‌ను ఈ సమావేశంలో నేతలు అమోదించనున్నారు. ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థుల్లో రాహుల్ ఒక్కరే ఉండనున్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించగానే పార్టీ కేంద్ర ఎన్నికల విభాగం ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది.

పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు గుజరాత్ ఎన్నికలకు ముందే అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను ముగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 9 నుంచి గుజరాత్ ఎన్నికలు ప్రారంభం కానున్నాయి.

ఈసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికలను డిసెంబర్ 31లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఈసీ ఆ పార్టీకి చివరి పొడగింపును ఇచ్చింది.

### 2019 ఎన్నికల తర్వాత వైకాపా కనుమరుగు

మీద రాతలేనన్నారు. రానున్న ఎన్నికల్లోగా ఏదొక విధంగా కేసుల నుంచి బయటపడాలన్న ఉద్దేశంతోనే పాదయాత్ర చేపట్టారని ఆరోపించారు. 16 నెలల జైలు జీవితం, 12 కేసుల్లో ఏ1 ముద్దాయిగా ఉన్న జగన్ పాదయాత్రను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 2019 ఎన్నికల తర్వాత వె%కాపా కనుమరుగవుతుందని మంత్రి అన్నారు.

### ప్రజాసంకల్పయాత్రకు బ్రహ్మరథం

సొదరదిన్నె నుంచి ఆదివారం ఉదయం యాత్ర కొనసాగించిన రాజన్న తనయుడి కోసం జనం భారీగా తరలివచ్చారు. ఆమదాల క్రాస్ రోడ్డు, గులాంనబీ పేట-బొందల దిన్నెక్రాస్ రోడ్డు, ఎల్లురి కొత్తపేట మీదుగా పాదయాత్ర కొనసాగుతోంది. దారి పొడవునా ప్రజల సమస్యలు వింటూ, అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ జననేత ముందుకు సాగుతున్నారు.

టీచర్లు, 108, 104 ఉద్యోగులు వైఎస్ జగన్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని అభ్యర్థించారు. తన వంతు ప్రయత్నం చేస్తానని జగన్ వారికి హామీయిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు పరిష్కరిస్తానని జననేత హామీయివ్వడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆలిండియా బంజారా సేవా సంఘం ప్రతినిధులు.. వైఎస్ జగన్‌ను కలిసి వాపోయారు. గిరిపుత్రిక పథకం కింద వివాహాలకు రూ.50 వేలు ఇస్తామని మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక గిరిజనులకు న్యాయం చేస్తామని జగన్ మాట ఇచ్చారు.

### ఇందిరాగాంధీకి ఘన నివాళి

పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. అనంతరం గాంధీభవన్, ఇందిరా భవన్‌లో తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు కేక్ కోసి పంపిణీ చేశారు. హరిత విప్లవం, బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణలు అమలు చేసిన ఇందిర దేశానికి చేసిన సేవలు మరువలేనివని నేతలు కొనియాడారు. అట్టడున ఉన్న ప్రజల అభ్యున్నతికి పరితపించేవారన్నారు. 2019లో కేంద్రం, తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని ఉత్తమ్, కేవీపీ పిలుపునిచ్చారు.

# ఒకేరోజు 15 ప్రాజెక్టులకు శ్రీకారం

రాయగడ : రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి నవీన్ సర్కార్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రూ.12 వేల కోట్ల పెట్టుబడులతో పదిహేను ప్రాజెక్టులకు ఒకేరోజు శ్రీకారం చుట్టింది. వీటి ద్వారా సుమారు 9 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నట్లు స్పష్టం చేసింది. సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రాజెక్టులను ప్రారంభించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఎరువులు, సిమెంట్, సౌర విద్యుత్తు, ఆహార పరిశ్రమ, బయోటెక్నాలజీ, సముద్ర ఉత్పత్తులు, విద్యుత్తు తదితర రంగాలకు చెందిన మొత్తం 15 ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రూ.11,690 కోట్ల పెట్టుబడులతో శ్రీకారం చుడుతున్న వీటి వల్ల 8,800 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నట్లు ఆయన చెప్పారు.

నవంబరులో మేకిన్ ఒడిశా-2018

ఈ సందర్భంగా సమావేశంలో సీఎం మాట్లాడుతూ మేకిన్ ఒడిశా-2018 సమావేశాన్ని వచ్చే ఏడాది నవంబరు 11 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించడం గమనార్హం. రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్న విజన్-2025 సాధనకు అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని నవీన్ కోరారు. మేకిన్ ఒడిశా-2016 అంశాన్ని నవీన్ ప్రస్తావిస్తూ వందకు పైగా కంపెనీలు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ప్రకటించడం విజయవంతమేనని అభివర్ణించారు. పారిశ్రామిక శాఖా మంత్రి నిరంజన్ పూజారి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదిత్యప్రసాద్ పాఢి, అభివృద్ధి కమిషనర్ ఆర్.బాలకృష్ణన్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజీవ్‌చోప్రాలతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం.

# పంటల నష్టం అధ్యయనం

గోపాలపూర్ : గత నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలు తెరిపిచ్చాయి. ఈ విపత్తు అన్నదాతలను నిలువునా ముంచేసింది. పంట నష్టం అధ్యయనం ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది వ్యవసాయ క్షేత్రాల్లో రైతులతో కలసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వాయుగుండం వల్ల 15 జిల్లాల్లో వరి, ఇతర పంటలు ప్రభావితమైన సంగతి విదితమే.

**22 సమితుల్లో అధ్యయనం**

గంజాం జిల్లా విషయానికొస్తే...22 సమితుల పరిధుల్లోని 429 పంచాయతీలకు చెందిన 1357 గ్రామాల్లో వరి, ఇతర పంటలు పాడయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,14,941 హెక్టార్లలో వరి, 1,90,760 హెక్టార్లలో ఇతర పంటలు వేశారు. జిల్లా వ్యవసాయశాఖ ఉప సంచాలకుడు మనోజ్‌కుమార్ బెహర తెలిపిన సమాచారం మేరకు... అకాల వర్షాలకు 16,031 హెక్టార్లలో వరి, 1,540 హెక్టార్లలో ఇతర పంటలు నీట మునిగాయి. దీనిపై శాఖ సిబ్బంది వ్యవసాయ క్షేత్రాల్లో అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం సాయం ప్రకటిస్తారు

రెవెన్యూ, వైపరీత్యాల నివారణ మంత్రి మహేశ్వర మహంతి విలేకర్లతో మాట్లాడుతూ సోమవారంనాటికి ఆయా జిల్లాల కలెక్టర్లు నష్టాల నివేదికలు సమర్పిస్తారన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడామని వివరాలు అందినంతనే ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ సమీక్షించి సాయం ప్రకటిస్తారని చెప్పారు.

# ప్రజలు కీర్తించే స్థాయికి చేరుతుంది

### ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై : ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వం అమ్మ రూపొందించినదని, ఇది ప్రజలు కీర్తించే స్థాయికి చేరుతుందని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. శివగంగైలో ఎంజీఆర్ శతజయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాత్రి చెన్నై నుంచి మదురైకు విమానంలో ముఖ్యమంత్రి బయలుదేరారు. మదురై విమానాశ్రయం చేరుకున్న ఆయనకు రాష్ట్రమంత్రులు దిండుకల్ శ్రీనివాసన్, సెల్లూర్ రాజు, ఉదయకుమార్, కలెక్టరు వీరరాఘవరావు, ఎమ్మెల్యేలు రాజన్ చెల్లప్ప, ఏకే బోస్ తదితరులు ఘనస్వాగతం పలికారు. తర్వాత పెరియార్ బస్టాండులోని కట్ట బ్రహ్మన విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కట్ట బ్రహ్మన వారసులు, అన్నాడీఎంకే కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తమిళనాడులో ఎంజీఆర్, అమ్మ తదితరులు సుపరిపాలన అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అమ్మ రూపొందించిన ప్రభుత్వం ఆమె చూపిన మార్గంలో ప్రజలు శ్లాఘించేలా కొనసాగుతుందని తెలిపారు. మదురై నగరానికి పలుసార్లు వచ్చానని, నేటికీ ప్రజలు అందించే ఘనస్వాగతం ద్వారా ఇది ఎంజీఆర్ - అమ్మ కోట అనే విషయాన్ని నిరూపిస్తోందన్నారు. తర్వాత మదురై సిమ్మకల్‌లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు వి.ఓ.చిదంబరం విగ్రహానికి, కేకే నగర్‌లోని ఎంజీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మదురైలోని రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. దక్షిణభారత దేశంలో తొలిసారిగా అరుదైన గుండె మార్పిడి శస్త్రచికిత్స చేసిన వైద్యుల బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెంట రాష్ట్రమంత్రులు, ప్రభుత్వ అధికారులు పలువురు ఉన్నారు.

మదురై విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి శనివారం మీనాక్షి అమ్మవారి ఆలయ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభ మర్యాదతో స్వాగతం పలికారు.

# లంక కెప్టెన్ ఫేక్ ఫీల్డింగ్.. కోహ్లిని పట్టించుకోని అంపైర్లు



స్పోర్ట్స్ : వివాదాస్పద ఫేక్ ఫీల్డింగ్ వ్యవహారం శ్రీలంక-భారత్ టెస్ట్ మ్యాచ్‌లోనూ ఎదురయ్యింది. మూడో రోజైన శనివారం భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఏకంగా శ్రీలంక కెప్టెన్ చండిమల్ ఈ మోసానికి పాల్పడ్డాడు.

భారత ఇన్నింగ్స్ 53వ ఓవర్‌ను దసున్ క్షనక బౌలింగ్ చేశాడు. ఆ ఓవర్‌లో నాలుగో బంతిని భువనేశ్వర్ కవర్స్ వైపు ఆడాడు. బంతికోసం పరిగెత్తిన చండి డైవ్ చేసి బంతిని ఆపే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే బంతి ముందుకు వెళ్లిపోయింది. చండి మాత్రం క్రీజు వైపు బంతిని విసిరినట్లు సైగ చేశాడు. ఇంతలో వెనకాలే వచ్చిన మరో ఫీల్డర్ బంతిని అందుకుని క్రీజ్ వైపు విసిరాడు. ఐసీసీ నూతన నిబంధనల ప్రకారం ఫేక్ ఫీల్డింగ్‌కు పాల?ిడితే పెనాల్టీగా ఐదు పరుగులు బ్యాటింగ్ జట్టుకు ఇవ్వాల్సి ఉంటుంది.


ఇక చండిమల్ చేసిన పనిపై అంపైర్లు నిగెల్ లాంగ్-జోయెల్ విల్సన్‌లు చర్చిస్తున్న సమయంలో..

డ్రెస్సింగ్ రూమ్ గ్యాలరీ వద్ద ఉన్న కోహ్లీ పెనాల్టీ కోసం 5 వేళ్లను సంజ్ఞగా చూపించాడు. కానీ, ఫీల్డ్ అంపైర్లు మాత్రం అతన్ని పట్టించుకోకుండా పెనాల్టీ ఇవ్వకుండానే ఆటను కొనసాగించారు.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా జెఎల్‌టీ కప్ డొమెస్టిక్ మ్యాచ్‌లో క్వీన్స్‌లాండ్ బుల్స్ ఆటగాడు మార్నస్ లబుస్‌ఛాగ్నె ఇదే రీతిలో ఫేక్ ఫీల్డింగ్‌కు పాల్పడగా.. అంపైర్లు పెనాల్టీ విధించారు.

# అధికారంలో లేని వారికి ఆగ్రహం సహజం

### - మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య - చెన్నైలో తెలుగువారితో ఆత్మీయ భేటీ



చెన్నై : అధికారంలో లేనివారికి ఆగ్రహం సహజమని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ఇటీవల అధికారులతో సమీక్ష సమావేశాల నిర్వహణపై పలు ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆస్కా కృష్ణా సమావేశ మందిరంలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటైంది. ఇందులో రోశయ్య మాట్లాడుతూ... చెన్నై నగరానికి తరచూ రావాలని ఉన్నా వయసు రీత్యా రాలేని పరిస్థితి అని చెప్పారు. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ ఇక్కడికి వచ్చి అందరినీ కలవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆస్కా అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ... రోశయ్యను మాజీ గవర్నర్ అని పిలవాలంటేనే మనసు అంగీకరించటం లేదన్నారు. ఆయన రాష్ట్రంలో గవర్నర్‌గా ఉన్నంతకాలం తెలుగువారికి అండగా ఉండేవారన్నారు. ఆత్మీయ కలయికను ఆస్కాలో నిర్వహించాలని రోశయ్య చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. తెలుగువారు ఎలా ఉంటారో వివరించే పద్యాన్ని జేకే రెడ్డి శ్రావ్యంగా ఆలపించారు. పంచెకట్టు, పైకండువా, గోంగూర పచ్చడి విశిష్టతను తెలిపారు. సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ... నగరంలోని తెలుగువారితో విడదీయరాని అనుబంధం ఏర్పరుచుకున్న ఏకైక గవర్నర్ రోశయ్యేనని తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించేలా అనుగ్రహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు రోశయ్యకు ప్రపంచ ఆర్యవె%శ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ స్వాగతం పలికారు. ఆయన రాజకీయ ప్రస్థానాన్ని సంక్షిప్తంగా పరిచయం చేశారు. కంచె ఐలయ్యపై తాము చేస్తున్న న్యాయపోరాటాన్ని సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా రోశయ్యను గజమాలతో సత్కరించారు. శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రాన్ని జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారిని చూస్తే తనకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అనుభూతి కలిగిందని పేర్కొన్నారు. రైలు ఆలస్యం కారణంగానే అనుకున్న సమయానికి రాలేకపోయానని, ఒకసారి బండి ఎక్కిన తర్వాత అది మన చేతిలో ఉండదని రోశయ్య చమత్కరించారు. అనంతరం ప్రస్తుత రాష్ట్ర గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ఇటీవల కోయంబత్తూరులో పర్యటించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం వివాదాస్పదమైందని, దీనిపై నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని విలేకర్లు రోశయ్య దృష్టికి తీసుకెళ్లారు.

# వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నియామకం

హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి నియోజకవర్గానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తను నియమించింది. పార్టీకి చెందిన సీనియర్ నేత దమ్ము సుహాసినిని నియోజకవర్గ సమన్వయ కర్తగా నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన వెలువడింది. ఈసందర్భంగా సుహాసిని పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పార్టీ ఆశయాలతో పాటు, నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు.

# మంచి ప్రమాణాలతో విద్యార్థులను తీర్చిదిద్దండి

## ఉపాధ్యాయులకు మంత్రి సుజయ్‌కృష్ణ సూచన

## బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు వసతుల కల్పనకు శంకుస్థాపన



విజయనగరం: విద్యార్థులను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దే దిశగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషిచేయాలని రాష్ట్ర గనులశాఖ మంత్రి ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు కోరారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన వసతులను కల్పిస్తోందని, ఉపాధ్యాయులు తమ వంతు బాధ్యతగా వారికి ఉత్తమమైన విద్యను అందించాలని సూచించారు. బొబ్బిలిలోని ఏ.పి. రెసిడెన్షియల్ స్కూల్‌లో రూ.1.00 కోటి సర్వశిక్షా అభియాన్ నిధులతో అదనపు వసతుల కల్పనకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యాసంస్థకు అవసరమైన వసతులన్నీ కల్పిస్తామని, యీ సంస్థ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ స్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లయితే కళాశాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉన్నట్లు చెప్పారని, వెంటనే బోర్‌వెల్‌ను మంజూరు చేస్తామని ప్రకటించారు. పాఠశాలకు అవసరమైన వసతులను కల్పించాల్సిందిగా సర్వశిక్ష అభియాన్ పి.ఓ. లక్ష్మణరావును కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆరు నెలల కాలంలో డార్మిటరీ, తరగతి గదులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సంస్థకు ఫర్నిచర్ కూడా సమకూరుస్తామని, ఉత్తమ విద్యాసంస్థగా రూపొందించేందుకు కావలసిన సహకారం అందిస్తామన్నారు.

విజయనగరం-బొబ్బిలి రోడ్డు నుండి కస్తూరిబా రెసిడెన్షియల్ స్కూలు వరకు రూ.45 లక్షల నిధులతో నిర్మించిన అప్రోచ్ సిసి రోడ్డును కూడా మంత్రి ప్రారంభించారు.



మధ్యతరగతి విద్యార్థులకు వారు జీవితంలో ఎదిగేందుకు ఉత్తమ విద్యను అందిస్తూ ఈ సంస్థ ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని ప్రిన్సిపాల్ బి.లక్ష్మీ నారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ తూముల అచ్యుత వల్లి, తూముల భాస్కరరావు, సర్వ శిక్ష అభియాన్ పి.ఓ. లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు గీతా సారాంశాన్ని తెలుసుకోవాలి

## వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి



విశాఖపట్నంః ఒన్ టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల శ్రీ గీతా ప్రచార సమితి కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా భవనంలో ప్రభుత్వం మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు గీతా జయంతి సందర్భంగా గీతా మౌఖిక పోటీలు నిర్వహించినాము. ఈ కార్యక్రమానికి ప్రధాన పరీక్షాధికారిగా విచ్చేసిన ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి జ్యోతిని వెలిగించి గీతా మౌఖిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు చదువుతోపాటు భగవద్గీత శ్లోకాలను పఠనం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి గీతా సారాంశాన్ని తెలుసుకొని సంస్కారంతో కూడిన జ్ఞానవంతులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. శ్రీ గీతా ప్రచార సమితి చేపడుతున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. 300 మందికిపైగా విద్యార్థులు గీతా మౌఖిక పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సిహెచ్.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.జగన్మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనజ, సంస్థ కోశాధికారి జి.వి.ఆర్. ప్రసాద్, శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులు, మహిళా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశాభివృద్ధి ఇందిరమ్మ ఘనతే

## నగర కాంగ్రెస్ కార్యదర్శి కె గోపాల్‌రెడ్డి



విశాఖపట్నం: దేశాభివృద్ధి ఇందిరమ్మ ఘనతే అని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె గోపాల్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం 31వ వార్డు కాంగ్రెస్ కార్యాలయం వద్ద జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు ఆదేశాలతో వార్డులో ఇందిరమ్మ శతజయంత్యుత్సవాలు నిర్వహించామని చెప్పారు. పేదరికం నిర్మూలనే ధ్యేయంగా నాడు ఆమె చేసిన కృషి ఫలితంగా నేడు ఎంతో మంది ఆనందంగా ఉండగలుగుతున్నారని అన్నారు. దేశ ప్రధాన మంత్రిగా గరీబ్ హఠావో నినాదంతో రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ చేసి పేదల పక్షపాతిగా దేశ ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అన్నారు. స్వతంత్ర పోరాటంలో వానరసేన పేరుతో ఉద్యమం చేశారని స్వతంత్రం అనంతరం దేశ ప్రధానిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, నాడు చేపట్టిన చర్యలు నేడు అభివృద్ధి ఫలాలు ఇస్తున్నాయన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వమే ఇందిరమ్మ పాలన

## పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు

## నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరమ్మ శత జయంత్యుత్సవాలు

విశాఖపట్నం: భిన్నత్వంలో ఏకత్వమే ఇందిరమ్మ పాలన అని ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ శత జయంత్యుత్సవాల్లో భాగంగా నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఇందిరమ్మ చిత్రపటానికి, జైలు రోడ్డులో విగ్రహానికి, అల్లిపురంలోని విగ్రహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఇందిరమ్మ తండ్రి జవహార్‌లాల్ నెహ్రూను ఆంగ్లేయ పాలకులు జైలులో ఉంచిన కాలంలో ఇందిరమ్మకు ఒక లేఖను రాశారు. ఆ లేఖను చూసిన ఇందిరమ్మ పసి హృదయం ఒక్కసారిగా స్పందించి దేశం కోసం నేనూ కూడా పోరాటం చేయాలని తలచి తన తోటిపిల్లలందరితో వానరసేన పేరుతో ఉద్యమానికి నాంది పలికారని చెప్పారు. నాటి నుండి మరణించేవరకు కూడా ఈ దేశానికి ఇందిరమ్మ అంకితమయ్యారని అన్నారు. ఇందిరమ్మ హయాంలో కులమతాలకు అతీతంగా పాలన సాగిందని అన్నారు. ఆమెను



కార్యక్రమంలో మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీనివాస్



స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ ప్రధానమంత్రులు అందరూ కూడా భిన్నత్వంలో ఏకత్వంగానే పాలన కొనసాగించారని నేడు నరేంద్ర మోదీ పాలన అందుకు భిన్నంగా కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ చిన్నతనం నుంచి దేశానికి ఏ రకమైన సేవలందించారో నేటి తరంవారికి తెలిసేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇందిరమ్మను స్ఫూర్తిగా తీసుకుని పనిచేసి తద్వారా కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, సీనియర్ నేత వజ్జిపర్తి శ్రీనివాస్, పీసీసీ మత్త్యకార సెల్ అధ్యక్షుడు కంటుమచ్చు తాతారావు, పీసీసీ కార్యదర్శి గొంపా గోవింద్‌రాజు, వుడా మాజీ చైర్మన్ పీఎస్ఎన్ రాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంపర సత్తిబాబు, సేవాదళ్ చైర్మన్ పెంటపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు జగ్గుపల్లి అప్పలరాజు, హేమలత, సిమ్మా భాస్కరరావు, ఎం.సత్యనారాయణరాజు, కొప్పుల వెంకటరావు, కాంగ్రెస్ నాయకులు కర్రి.రామారెడ్డి, గుంటూరు. నర్సింహమూర్తి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఛలో అసెంబ్లీని అడ్డుకోవడానికి ప్రభుత్వం కుట్ర



నర్సీపట్నంః ఛలో అసెంబ్లీని అడ్డుకునేందుకు నిర్బంధం, ముందస్తు అరెస్టులను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి తీవ్రంగా ఖండించారు. ఆదివారం విశాఖజిల్లా నర్సీపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధనకై సిపిఐ తలపెట్టిన చలో అసెంబ్లీని అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రను అందరూ తిప్పికొట్టాలని అన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ కార్యక్రమానికి సినీ యాక్టర్లు శివాజీ, ప్రకాష్‌రాజ్ తదితరులు సంఘీభావం తెలపారన్నారు. పార్లమెంట్ వేదికగా అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారు. ఎన్నికల వాగ్దానంలో ప్రస్తుత ఉపరాష్ట్రపతి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 సంవత్సరాలు ఇవ్వాలని పగల్భాలు పలికారన్నారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి అభివృద్ధిని అటకెక్కించారన్నారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కోవడం వలన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోతున్నారన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రాన్ని కనీసం ప్రశ్నించే స్థాయి కూడా లేకుండా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ మండలాల్లోనూ సిపిఐ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్ర స్థాయిలో ఆయన ఖండించారు. ప్రత్యేక హోదా సంజీవిని కాదన్న ముఖ్యమంత్రి ఇటీవలకేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలకు మరో 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ప్రకటించడాన్ని కన్నువిప్పిచూడాలన్నారు. ప్రత్యేక హోదా ప్యాకేజీతోనే హిమాచల్‌ప్రదేశ్‌లో తలసరి ఆదాయం, పెట్టుబడులు పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగాలు పెరిగాయన్నారు. మన రాష్ట్రంలో ఏడు జిల్లాలకు 350 కోట్లు ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకుందన్నారు. ముఖ్యమంత్రి కేంద్రాన్ని నిలదీయలేకపోతే, అఖిలపక్ష నాయకత్వాన్ని కేంద్రానికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న వారిని నిర్బంధించడం వెనుక ప్రభుత్వ కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నర్సీపట్నం, జికెవీధి మండలాల్లో ముందస్తు అరెస్టులు జరగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా సమితి సభ్యులు రుత్తల అప్పలనాయుడు (పెదబుజ్జి) పాల్గొన్నారు.

# చెరువులో లేఆవుట్ వేసేందుకు తెలుగు తమ్ముళ్ల స్కెచ్

- 4వ రోజు ప్రభుత్వ భూములు ఆన్యాక్రాంతం
- ముక్కున వేలేసుకున్న డిప్యూటి కలెక్టరు

పెందుర్తి ః చెరువును లెవిల్ చేసి ... ఆ చేరువులోనే ఏకంగా లేఆవుట్ వేసేందుకు తెలుగు తమ్ముళ్లు ఎంచక్కా స్కెచ్ బాగానే వేశారు. ఈ స్కెచ్‌తో పాటు ఆ లేఆవుట్ లోకి కారులు, ఇతర వాహానాలు రాకపోకలు సాగించేందుకు కల్వర్టు కూడా నిర్మాణాం చేశారు. దీనికి తోడు ఆ లేఆవుట్‌లోకి అప్పుడు కరెంటు స్థంబాలు కూడా నిర్మాణం చేసేసారు.



ఇంతకి ఈ ప్లాన్ పక్కాగా అమలు జరిగితే మన తెలుగు తమ్ముళ్లందరికీ సూమారు 500 కోట్లు పై మాటే. ఈ లేఆవుట్ స్కేచ్ ఏక్కడో మారుమూల గ్రామం కాదు.

విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, లక్ష్మీపురం గ్రామం శివారులో ఉన్నా చెరువులో రియల్ వ్యాపారం సాగించేందుకు తెలుగు తమ్ముళ్లు ఏంచాక్క ప్లాను వేసారు. ప్రభుత్వ భూములు ఆన్యాక్రాంతంపై భూములు పరిశీలించడానికి భూ పరిరక్షణ డిప్యూటి కలెక్టరు ప్రమీల గాంధీ ఆదివారం చినముషిడివాడ, పెందుర్తి ప్రాంతంలో తన సిబ్బందితో విస్తృతంగా పర్యటించారు. పెందుర్తి దొగ్గవానిపాలెం కాలనీలో కొంత మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించు కోని, ఆ భూములకు జీరాయితీ సర్వే నెంబర్లుతో రిజిస్ట్రేషన్లు చేసేసి ఆ భూములు విక్రయించినట్లు ఆమె పరిశీలనలో వెల్లడైయింది. ఈ భూముల్లో ఇప్పటికే పక్కా భవనాలు నిర్మాణాలు కూడా జోరందుకున్నాయి. ఈ నిర్మాణాలను ఆమె సిబ్బందిపై ఆగ్రహాం వ్యక్తం చేసారు. అలాగే చినముషిడివాడ దరి గొల్లనారాయణపురం చెరువును ఆక్రమించుకోని కొంత మంది లేఆవుట్ వేసి, ప్రభుత్వ భూములు విక్రయించినటు ఆమె గుర్తించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలపై తగు చర్యలు చేపట్టలని ఆమె రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

# వైభవంగా ప్రారంభమయిన మార్గశిర మాసోత్సవాలు



విశాఖపట్నంః నగరంలోగల శ్రీ కనకమహాల7ట్మ అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 9.40 నిలకు దక్షిణ నియజకవర్గం శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలనం చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలతో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిదిగా ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎస్.జె. మాధవి ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రాలతో, నాదస్వరాలతో స్వాగతం పలికిన అనంతరం మొదటగా గణపతి పూజ, పుణ్యాహ వాచనం, రుత్విక్ వరుణం, వేద పారాయణలు, శ్రీచక్రార్చన, లక్ష్మీ హెూమము తదనంతరం శ్రీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారిణి ఎస్.జె. మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ డబ్ల్యు భాస్కరరావు, ధర్మకర్తలు చిప్పాడ చంద్రరావు, పిల్లి వెంకట రమణ, రావి చలపతిరావు, వూన విజయకుమార్, చీదరాల దుర్గాప్రసాద్, ఎక్స్ అఫీషియో మెంబర్ బృందావన దేశికాచార్యులు మరియు ఆలయ ఉప కార్యనిర్వాహక ఇంజనీరు సిహెచ్‌వి రమణ, సహాయ కార్యనిర్వాహణాధికారి వి. రాంబాబు, పి. రామారావు, ఎస్. సూర్యకుమారి, సహాయ ఇంజనీరు కెఎస్ఎన్ మూర్తి, పర్యవేక్షకులు ఎన్‌వివిఎస్ఎస్ఏఎన్ రాజు, పి. శ్రీనివాస్ మరియు వైదిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శ్రీ అమ్మవారి అన్నప్రసాద వితరణ ప్రారంభింపబడినది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో బారు కృష్ణమూర్తిచే హరికథా గానం భక్తులను ఎంతగానో అలరించింది. నేడు కొలచిన హరినాథ్ బాబు వారిచే హరికథా గాం ఏర్పాటు చేయడమైనది.



# విజయభాను సంపాదకీయం

## సమావే'షా'లు గమనిస్తున్నారు

సభాముఖంగా వాస్తవాలు వివరించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలమైంది. సభావేదికగా ప్రజలకు వాస్తవాలు వివరించినప్పుడు ప్రజలు కూడా ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయవలసిన తమ బాధ్యతను గుర్తిస్తారు. శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏ అంశాన్నైనా తమ సభ్యుల ద్వారా అడుగవచ్చు. కానీ సమావేశాల మొదటి రోజే వీధుల్లోకి ఎక్కడం ఎంతవరకు సబబు అనే ఆలోచన ప్రజలకు కలుగడం సహజం. ఇటువంటి పెడ ధోరణులను ప్రజలు గమనిస్తుంటారని కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర పక్షాలు గ్రహిస్తే,సభా కార్యక్రమాలు మరింత అర్థవంతంగా సాగుతాయి.

శాసన సభా సమావేశాలు మూడు వారాలుగా సాగుతున్న తీరు రాష్ట్ర ప్రజానీకానికి హర్షామోదాలను కలిగిస్తున్నది. చట్టసభల్లో గొడవలు సాగడం- అవీ ముదిరినప్పుడు- తిట్లు, కొట్లాటలు సాధారణమైన విషాదకర పరిస్థితుల్లో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు దేశానికే గర్వకారణంగా చెప్పుకోవచ్చు. ఏ రాష్ట్రానికో వెళ్ళి చూడవలసిన అవసరం కూడా లేదు. ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులను ఒక్కసారి జ్ఞాపకం చేసుకుంటే చాలు, తెలంగాణ సాధించుకున్న తరువాత మనం పెంచి పోషిస్తున్న కొత్త విలువలు, సరికొత్త రాజకీయ పాలనా సంస్కృతి ఏమిటో బోధపడుతుంది. చట్టసభల్లో చర్చలను ప్రజలు టీవీల ద్వారా చూడగలుగుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజాప్రాతినిధ్య వ్యవస్థను ప్రజలకు మరింత చేరువచేసింది. అయినా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోకుండా ప్రజాప్రతినిధులు విలువైన సభాకాలాన్ని వృథా చేయడం ఒక వికృత పరిణామం. నాయకులు తాము అల్పంగా వ్యవహరించడం ద్వారా ఒక జాతి భవిష్యత్తునే పణంగా పెడుతున్నామనే కఠోర వాస్తవాన్ని గ్రహించడం లేదు. ఈ పరిస్థితులను ముందే పసిగట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టాలనే ఆలోచనతో సభాకార్యక్రమాలను నిర్మాణాత్మక చర్చలతో పరిపుష్టం చేద్దామని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రతిపక్షాలు పాత వాసనలు వీడనప్పటికీ, క్రమంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొంత మారక తప్పలేదు. ఇప్పటికీ కొన్ని ప్రతిపక్షాల వైపు నుంచి అపశృతులు వినబడుతున్నప్పటికీ మొత్తమ్మీద తెలంగాణ శాసన సభా సమావేశాలు కొత్త రాజకీయ సంస్కృతికి అద్దం పడుతున్నాయని చెప్పవచ్చు. ప్రధాన చర్చల్లో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని సమాధానాలు ఇవ్వడం గమనార్హం. ఉదాహరణకు - భూమి రికార్డుల ప్రక్షాళన ఒక మహత్తరమైన కార్యక్రమం. అస్పష్టత మూలంగా అనేక మోసాలు కూడా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొత్తం భూమి రికార్డులను చక్కది ద్దే క్లిష్టమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో సాహసంతో నేర్పుతో చేపట్టింది. ప్రభుత్వ నిజాయితీని ప్రశంసించాలే, కనీసం సహకరించాలె. కానీ భూ కబ్జాల కోసమే ఈ ప్రక్షాళన చేపట్టారనే నిర్హేతుక వ్యాఖ్యలు చేసిన వారున్నారు. భూముల రికార్డులు చక్కదిద్దడం అసాధ్యమని కూడా అన్నారు. కానీ ముఖ్యమంత్రి ఈ ఆరోపణలను తిప్పికొడుతూ, అవసరమైతే భూ కబ్జాలపై ప్రత్యేక చర్చ జరుపుదామని సవాలు విసిరారు. రైతులకు ఇచ్చే పంటల పెట్టుబడి పక్కదారి పట్టకుండా ఈ ప్రక్షాళన ఉపయోగపడుతుందని వివరించారు. రైతు సమితుల పై అపోహలను చెదరగొట్టారు. రైతుల రుణమాఫీ పూర్తయిందని ప్రకటిస్తూ, ఇంకా ఎక్కడైనా మిగిలి ఉంటే చూపించమని ప్రతిపక్షాలను నిలదీశారు. రైతులకు 24 గంటలు విద్యుత్ ఇవ్వడం, రాష్ట్రానికి విద్యుత్ కొరత లేకుండా చేయడంపై కూడా వివరణాత్మకంగా వెల్లడించారు. హరితహారంపై చర్చకు బదులిస్తూ, ఒక్క అంగుళం అడవిని కూడా కబ్జా కానివ్వబోమని చెప్పడం ఎంతో భరోసానిచ్చింది. గ్రామస్థాయిలో నర్సరీలు పెడతామంటూ వివరించిన తీరు ప్రజల్లో కూడా స్ఫూర్తిని నింపింది. చెప్పి న దానికన్నా వెయ్యి కొలువులూ ఎక్కువే ఇస్తామని చెప్పిన తీరు ఉద్యోగార్థులకు ధైర్యం ఇచ్చింది. ఇకనుంచి ఔట్‌సోర్సింగ్ విధానాలు ఉండవనీ, క్రమబద్ధీకరణలోనూ రిజర్వేషన్లు పాటిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. పాత సచివాలయ భవనం లోపాలను, కొత్తది కట్టవలసిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి స్వయంగా వివరించారు. తెలంగాణ ప్రజలు గర్వపడే విధంగా చరిత్రలో నిలిచిపోయే కొత్త సచివాలయం కట్టితీరుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభలో వెల్లడించిన వివరాలు ముస్లింలు, గిరిజనులు, దళితులలో ఆత్మస్థైర్యం కలిగించేవిగా ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి అంశాన్ని విడమరచి చెప్పవలసిన ప్రత్యేక సందర్భం కూడా తెలంగాణలో ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇక్కడి ప్రజలకు పాలించుకోవడం చేతకాదని బహిరంగంగా పరాయి శక్తులు ఎద్దేవా చేశాయి.

# డేటింగ్ కోసం స్పెషల్ కోర్సు



వింతలకు విచిత్రాలను కేరాఫ్ అడ్రస్ చైనా.. కొత్త కొత్త విధానాలను ప్రవేశపెట్టడంలో చైనీయులు ముందుంటారు. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే ఇంజనీరింగ్, మెడిసిన్ చదవడానికి కోర్సులు ఉన్నట్లే ప్రేయసి, ప్రియుడు లేనివారికోసం కూడా ప్రత్యేక కోర్సులు చైనీయులు నడుపుతున్నారు. అదే డేటింగ్ కోర్సు. అంతేకాదు ఈకోర్సు చేసిన వారిలో 90శాతం మందికి జీవిత భాగస్వాములు దొరికారంట. చైనకు చెందిన ఝూంగ్ మైండాంగ్ అనే వ్యక్తి 2012లో ప్రేమలో విఫలయ్యాడు. ఆబాధ నుంచి బయట పడటానికి చాలా ప్రయత్నాలే చేశాడు. అయితే తిరిగి ప్రేమలో పడితేనే కోలుకోగలడు భావించాడు. అంతే కాకుండా తనలాంటి వాళ్ల గురించి ఆలోచించాడు. ప్రేయసి/ప్రియుడు కోసం వెతుక్కొనే వారికి ఓ ప్రత్యేక కోర్సు ప్రారంభించాలని భావించాడు. ఇందుకోసం 2014లో తూర్పు చైనాలోని జినాన్ నగరంలో ఝూంగ్ మైండాంగ్ ప్రత్యేకంగా పాఠశాల ప్రారంభించాడు. అంతేకాకుండా ఇంటర్నెట్‌లో కూడా శిక్షణ ఇస్తున్నాడు. ఇందుకోసం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

కోర్సులో భాగంగా మొదట వారి వేషధారణ, జీవన శైలిలను మార్చుతారు. అనంతరం వారి అభిప్రాయాలకు దగ్గరగా ఉన్న ఇతర వ్యక్తుల వివరాలను అందిస్తారు. ఇద్దరికీ నచ్చితే లాంగ్ రిలేషన్ ఏర్పడే విధంగా శిక్షణ ఇస్తారు. ఇందులో థియరీ క్లాసులతో పాటు, ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి. సోషల్ మీడియా ప్రొఫైల్ ఫోటోల కోసం ఫోటో సెషన్లు, సెల్ఫీ క్లాసులు, ప్రత్యేకంగా ఉంటాయి. ఆన్‌లైన్ తరగతుల కోసం 45 డాలర్ల నుంచి ప్యాకేజీ ప్రారంభం అవుతుంది. అంతేకాకుండా ఒక్కొక్కరికీ పర్సనల్‌గా చెప్పడానికి మూడు వేల డాలర్లు ఫీజుగా తీసుకుంటాడు. ఇటేవలే ఇతర నగరాల్లో బ్రాంచ్‌లకు కూడా ఏర్పాటు చేశాడు. 'ఫాల్ ఇన్ లవ్ ఎమోషనల్ ఎడ్యుకేషన్' పేరుతో ప్రారంభించిన ఈపాఠశాలలో ఇప్పుడు 300 మంది శిక్షణ తీసుకుంటున్నారు.

# వివాదం రేపుతున్న కరీనా మార్ఫింగ్




జైపూర్ : రాజస్థాన్‌లో లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా హిందు స్పిర్చువాలిటీ అండ్ సర్వీస్ ఫౌండేషన్ (హెచ్ఎస్ఎస్ఎఫ్) అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ఎప్ఎఫ్ విడుదల చేసిన కరీనా కపూర్ ఖాన్ ఫొటో అత్యంత వివాదాస్పదంగా మారింది. కరీనా ఫొటోను, బుర్ఖా వేసుకున్న మరో మహిళ ఫొటోతో మార్ఫింగ్ చేసి.. లవ్ జిహాద్ వలలో చిక్కుకుంటే.. మీరు ఇలా అవుతారంటూ విద్యార్థులకు హెచ్ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలు బోధిస్తున్నారు. ఈ కరపత్రాన్ని హెచ్ఎస్ఎస్ఎఫ్ బహిరంగ ప్రదేశాల్లో పంపిణీ చేస్తోంది. ముస్లిం, క్రైస్తవ మతాలు చేస్తున్న మతమార్పిడి మోసాలను విద్యార్థులకు తెలియచెప్పేందుకే ఇలా చేస్తున్నట్లు సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో హెచ్ఎస్ఎస్ఎఫ్ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక పెంపెందించే కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ అవగాహన కార్యక్రమాల్లో రాజస్థాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులంతా హాజరు కావాలని అక్కడి రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ అవగాహనా కార్యక్రమాల్లో హిందూ జీవన విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని హెచ్ఎస్ఎస్ఎఫ్ బోధించనుంది.

# భార్యల చేతిలో భర్త హత్య

హైదరాబాద్: వేధింపులు భరించలేక భర్తను హత్య చేశారు ఇద్దరు భార్యలు. ఈ ఘటన హైదరాబాద్ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కూకట్‌పల్లి అస్బెస్టాస్ కాలనీలో మహేందర్ యాదవ్ అనే వ్యక్తి ఇద్దరు భార్యలు జ్యోతి, పద్మతో కలిసి జీవిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన మహేందర్ తరుచూ తాగొచ్చి భార్యలను వేధిస్తున్నాడు. కూడా మద్యం తాగి వచ్చిన వేధిస్తున్న భర్తను భార్యలిద్దరూ ఎదురుతిరిగి చున్నీని గొంతుకు బిగించారు. దీంతో అతడు ప్రాణం కోల్పోయాడు. అయితే ఇంకా బతికున్నాడేమోనన్న అనుమానతంతో మృతదేహాన్ని కిరోసిన్ పోసి నిప్పటించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన జ్యోతి, పద్మను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

# సహకార రుణాల రద్దుతో రైతులకు లబ్ధి

రాయచూరు : ప్రభుత్వం సహకార రుణాలను రద్దు చేయడం వల్ల రాయచూరు, కొప్పళ జిల్లాలకు చెందిన 89,513మంది రైతులకు రూ.272.36 కోట్ల లబ్ధి చేకూరుతుందని ఆర్‌డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు పంపనగౌడ బాదర్లి చెప్పారు.

ఆయన సమావేశంలో మాట్లాడారు. జూన్ నుంచి ఆగస్టు వరకు రూ.64 కోట్ల రుణాలు రద్దయ్యాయని వివరించారు. సహకార సంఘాల ద్వారా రూ.40 కోట్ల కొత్త రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నిరుడు రూ.60 కోట్ల రుణాన్ని ఇచ్చామని, ఈసారి నాబార్డు రుణం తగ్గించడం వల్ల రూ.40 కోట్లకే పరిమితమైనట్లు తెలిపారు. మరో ఆరు కొత్త శాఖలు ప్రారంభించేందుకు నాబార్డు అనుమతి ఇచ్చిందన్నారు. కారటగి, మస్కి, ముదుగల్, జాలహళ్లిలో నూతన శాఖలు ప్రారంభ మయ్యాయని, మునీరాబాద్, సిరివారలో త్వరలో శాఖలు తెరుస్తున్నట్లు వివరించారు. ప్రతి పంచాయతీలో ఒక వ్యవసాయ సహకార సంఘాన్ని స్థాపించాలని ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు.

ఈ నెల 20న రాయచూరులోని గంజ్ కల్యాణ మండపంలో అఖిల భారత 64వ సహకార సప్తాహ సమరూప సమారంభ కార్యక్రమాన్ని సహకార మంత్రి రమేష్ జార్కిహోళి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు డైరక్టర్ విశ్వనాథ్ పాటిల్ మాట్లాడుతూ పారదర్శకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

# కవి సమయం

## గగన కుసుమం

సాక్షిగా వస్తాను
ఈ భువనం నుండి గగనానికి
సామాన్యుడి బతుకుని
కన్నీటి నదిలో
కష్టాల నావపై
పయనింప చేస్తున్న
రాజకీయ నాయకుల చరిత్రలను
వివరించడానికి
సాక్షిగా వస్తాను
విద్య వినయములకు
స్వస్తి చెప్పి
తప్పుదోవ పడుతూ
మత్తు గమ్మత్తులకు
చిత్తు చిత్తుగా
బానిసలవుతున్న
యువతీయువకుల
విలాసాలను
విశదీకరించడానికి
సాక్షిగా వస్తాను..

**ఆకాశం సత్యప్రకాష్**
9985585552

# పంచాంగం

మాసం : కార్తీక; తిథి :మార్గశిర శుద్ధ పాడ్యమి సా.5.25; అనూరాధ రా.9.08; తె.వ.3.18ల 5.03.

**సోమవారం 20-11-2017**

**మేషం:** ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. స్త్రీలకు శారీరక రుగ్మతలు, పనివారలతో చికాకులు అధికం. ఉద్యోగస్తులకు అధికారుల తీరు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. వాహనం పిల్లలకు ఇవ్వటం క్షేమం కాదు. మీ ప్రసంగాలు శ్రోతలను ఆకట్టుకుంటాయి. ఊహించని పెద్ద ఖర్చు తగిలే ఆస్కారం ఉంది.

**వృషభం:** ఆర్థిక వ్యవహారాల్లో ఎవరినీ అతిగా విశ్వసించవద్దు. సంగీత, సాహిత్య కళాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. ప్లీడర్లకు తమ క్లయింట్‌లు తీరు ఇబ్బందులకు గురిచేస్తుంది. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించటం వల్ల అస్వస్థతకు లోనవుతారు. స్త్రీలకు టీవీ, కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

**మిథునం:** బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. వివాదాస్పద విషయాల్లో మీ ప్రమేయం లేకుండా జాగ్రత్త వహించండి. ధనం కంటే ఆత్మగౌరవానికే ప్రాధాన్యం ఇస్తారు. ప్రయాణాల్లో కొంత అసౌకర్యం కలిగినా నెమ్మదిగా సమసిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులను ఎదుర్కొంటారు.

**కర్కాటకం:** ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి సమస్యలు తలెత్తుతాయి. జాగ్రత్త వహించండి. మీ సంతానం విపరీత ధోరణి ఆందోళన కలిగిస్తుంది. మీ కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగస్తులు ఇతర వ్యాపకాలు విడనాడి స్థిరచిత్తంతో పని చేయవలసి ఉంటుంది. గత సంఘటనలు అనుక్షణం జ్ఞప్తికి వస్తాయి.

**సింహం:** బ్యాంకు వ్యవహారాలలో ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. వృత్తి వ్యాపారులకు అన్ని విధాలా కలసిరాగలదు. కుటుంబీకుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించవలసి ఉంటుంది. బంధువుల నుండి సమస్యలు తలెత్తుతాయి. విద్యార్థులకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. క్రీడాకారులకు ప్రోత్సాహకరం.

**కన్య:** ఆర్థిక, మానసిక సమస్యలకు చక్కని పరిష్కార మార్గం గోచరిస్తుంది. కలిసి వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటారు. ఉద్యోగ యత్నంలో నిరుద్యోగులకు బిడియం, అభిమానం కూడదు. వృత్తి వ్యాపారులకు అన్న విధాలుగా కలసిరాగలదు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు మంచి స్పందన లభిస్తుంది.

**తుల:** వ్యాపారాభివృద్ధికి చేపట్టిన పథకాలు మంచి ఫలితాలనిస్తాయి. సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మంచి మాటలతో ఎదుటివారిని ప్రసన్నం చేసుకోవటానికి యత్నించండి. కలిసివచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటారు. ఆపత్సమయంలో ఆప్తులు అండగా ఉంటారు.

**వృశ్చికం:** బ్యాంకు వ్యవహారాలలో పరిచయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించండి. ఎంతటి విపత్కర పరిస్థితులైనా నిబ్బరంగా ఎదుర్కుంటారు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు మంచి స్పందన లభిస్తుంది. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులెదుర్కుంటారు. ఒక స్థిరాస్తి విక్రయంలో పునరాలోచన మంచిది.


**ధనుస్సు:** ప్లీడర్లకు తమ క్లయింట్‌లు తీరు ఇబ్బందులకు గురిచేస్తుంది. వృత్తి వ్యాపారాల్లో ఆటుపోట్లు, పోటీని దీటుగా ఎదుర్కుంటారు. పలుకుబడి, మంచితనం కలిగిన వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

**మకరం:** బ్యాంకు లోన్లు, పర్మిట్లు మంజూరవుతాయి. బంధువులు మీ నుంచి పెద్ద మొత్తంలో ధన సహాయం ఆర్థిస్తారు. మీ ఉన్నతిని చూసి అసూయపడేవారు అధికమవుతున్నారని గమనించండి. మీ వ్యాపకాలు తగ్గించుకుని కుటుంబ విషయాలపై శ్రద్ధ వహించండి. దూర ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆలయాలను సందర్శిస్తారు.

**కుంభం:** ఎరువులు, మందులు, సుగంధ ద్రవ్య, ఆల్కహాలు వ్యాపారులకు అభివృద్ధి కానవస్తుంది. బ్యాంకు వ్యవహారాలలో చికాకులు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాలు గోప్యంగా ఉంచండి. రాజకీయాల్లో వారికి ప్రత్యర్థుల ద్వారా సమస్యలు ఎదుర్కొనకతప్పదు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి, శ్రమాధిక్యత వంటివి తలెత్తుతాయి.

**మీనం:** వాతావరణంలో మార్పుల వలన వ్యవసాయదారులకు నూతన ఉత్సాహం కానరాగలదు. స్త్రీల వాక్ చాతుర్యానికి మంచి గుర్తింపు లభిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు పురోభివృద్ధి. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు తాత్కాలికమే అయినా సద్వినియోగం చేసుకోవటం మంచిది.

# జ్ఞానామృతం పంచే గురు పౌర్ణమి



**అ**యితే ఈ రోజున సన్యాసులంతా వ్యాసుని రూపంలో వున్న తమ గురువుని కొలుస్తున్నారన్న మాట ! వైష్ణవ పురాణం దానం చేస్తే ఆషాఢ పూర్ణిమనాడు విష్ణులోకం పొందుతారుట. వ్యాసుడు సకల కళా నిధి, సకల శాస్త్రవేత్త, శస్త్ర చికిత్సవేది, మేధానిధి, వైద్యవరుడు, ఆత్మవిద్యానిధి, వైద్య విద్యానిధి.ఈ రోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుని తప్పక పూజించాలి.

**శ్లో: శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణం**
**సూత్ర భాష్యవృతా వందే భగవంతౌ పునః పునః**
**అని పఠిస్తే బ్రహ్మత్వసిద్ధి కలుగును!**

**ఆషాఢ పూర్ణిమ ప్రత్యేకతలు**

ఈ రోజు గురు పూర్ణిమతో పాటుగా కోకిలా వ్రతం, మహాషాఢి అని, వ్యాస పూజ, శివశయనోత్సవం, జితేంద్రరాయ జాతర. ఆ, కా, మా, వై పూర్ణిమలో మొదటిదైన ఆషాఢ పూర్ణిమ స్నానం... ఎన్నో వున్నాయి. కోకిలా వ్రతం విచిత్రంగా వుంటుంది, ఈనాడు సాయంకాలం నది స్నానం చేసి తెలకపిండితో కోకిల ప్రతిమ చేసి పూజ చేయాలి.

నెల రోజులు పాటు అమ్మాయిలు, అబ్బాయిలు ఎవరు చేసినా అందమైన భాగస్వామి దొరుకుతాడని అంటారు. కోకిల, తెలకపిండి ప్రధానంగా కావాలి. ఆషాఢంలో తెలకపిండి తీసుకోవాలి, కోకిల వలస వెళ్ళిపోతుంది. కోకిలాదేవి ద్రుపదుని భార్య. (ఈ వ్రత విధానం, కథ అంతా స్మృతి కౌస్తుభంలో చూడచ్చు).

**జితేంద్రరాయ జాతర**

మహబూబ్‌నగర్ జిల్లా వసుమర్తి గ్రామం దగ్గర భీమనది కృష్ణలో సంగమించే చోటున ద్వీపం వుంది. అక్కడ శ్రీ కృష్ణ ద్వైపాయన బృందావనం అనే ఆరామం దగ్గర జితేంద్రరాయ పేరిట అతి ఘనంగా వ్యాస పూర్ణిమ నిర్వహిస్తారు.

**బాసర (బాసర అదిలాబాద్ జిల్లాలో వుంది)**

ఇక్కడ వ్యాస మహర్షి అమ్మవార్ని సైకత శిల్పంగా చేసి పైజలు చేసాడని అంటారు. ఆ కథతో పాటుగా వ్యాసతీర్థం కూడా అక్కడ చూడాల్సినది. వ్యాసపురియే కాలక్రమముగా వాసర అని పిలువడబడింది. సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు యొక్క అపరరూపం గా భావింపబడి సమస్త ప్రపంచమునకు, ఆధ్యాత్మిక గురువుగా, జ్ఞానజ్యోతి స్వరూపుడై వెలిసిన శ్రీ వేదవ్యాస ముని నామమున, ప్రసిద్ధమైన వ్యాస తీర్థం సర్వతీర్థాలకు తలమానికం!

బ్రహ్మ నారదునికి వ్యాస తీర్థ మహిమ ఇలా వివరించాడు. నారదా! ఈ వ్యాస తీర్థమున స్నానము గావించినచో సమస్త మనోరథములు నెరవేరతాయి. సంతానార్థులకు సంతానం, భోగభాగ్యములు కోరువారిందు స్నానం చేసి దేవిని ఉపాసిస్తే సమస్త భోగభాగ్యములు, మోక్షమును కోరువారీ వ్యాస తీర్థమున స్నానించినా జీవన్ముక్తుల గుదురు.

అంటే ఎవరైతే వ్యాస తీర్థమున ఒక్క సారియైననూ స్నానం చేస్తారో, సమస్త పాపముల నుంచి తక్షణ విముక్తి. ఈ వ్యాస తీర్థ మహత్యం పారాయణ చేసి నవారికి, వ్యాసుడు గావించిన సరస్వతీ స్తోత్రములను ఎవరు నియమ పూర్వకంగా పఠింతురో,

## సంకీర్తన

ఎవరు ఎందులో వారికి తప్పక శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి కటాక్షం వుంటుందిట.

సద్గురువులు తమ శిష్యులని పుత్రవాత్సల్యంతో చూస్తారు. పరబ్రహ్మ స్వరూపంగా చూస్తారు. శాంతానికి ఉనికిపట్టు, వారు చాపల్యం గానీ, చిరాకు గాని పొందరు. తమ పాండిత్యానికి గర్వించరు.వారికి ధనవంతులు, పేదలు, నీచులు... అనే తారతమ్యం వుండనే వుండదు. మన పూర్వజన్మ సుకృతం వల్ల సాయిబాబాను అలాంటి సద్గురువును పొందాం. (షిర్డీలో చాలా బాగా ఉత్సవాలుంటాయి).

భక్తి విశ్వాసాలనే హృదయ దీపాన్ని సరిచేసి ప్రేమ అనే వత్తిని వెలిగించాలి. అప్పుడు జ్ఞానజ్యోతి (ఆత్మసాక్షాత్కారం) వెలిగి ఎక్కువ తేజస్సుతో ప్రకాశిస్తుంది.

ప్రేమలేని జ్ఞానం వృఎఏథా. ప్రేమ లేనిదే చదువులు, వినుట, నేర్చుట అనేవి నిష్ఫలములు. ప్రేమ నివసిస్తే భక్తి, శాంతి, స్వేచ్ఛ వరుసగా వస్తాయి. యదార్థమైన కాంక్ష, ఉత్తమ భావమున్న చోట భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. అదే ప్రేమ మోక్షానికి మార్గం... గురువు ద్వారానే!

**ఓం గురుభ్యోనమః - ఈ.హరిహర్ నందన్.**

# అపోలో హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



విశాఖపట్నం: అపోలో హాస్పిటల్ మరియు లైఫ్‌బాక్స్ ఫౌండేషన్ కలిసి ఒక వర్క్‌షాప్‌ను ఆదివారం అపోలో హాస్పిటల్ ఆడిటోరియంహాల్ నందు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఎవరైతే వర్క్‌షాప్‌నకు వచ్చారో వారికి సర్టిఫికేట్ ఇవ్వడం జరిగిందని, డాక్టర్ సందీప్ ఛత్రత్ తెలిపారు. అపోలో హాస్పిటల్ విశాఖపట్నం క్రిటికల్ కార్ మరియు ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ అచ్యుత్, డాక్టర్ రమాదేవి మరియు డాక్టర్ రాజేష్ వర్క్‌షాప్‌ను నిర్వహించడం జరిగినది. ఈ వర్క్‌షాప్‌నకు 90 మంది డాక్టర్లు మరియు టెక్నీషియన్లు హాజరవ్వడం జరిగింది. అపోలో హాస్పిటల్స్, విశాఖపట్నం క్రిటికల్ కేర్ యూనిట్‌లో 100 బెడ్లు, 10 ఆపరేషన్ థియేటర్స్ ఉన్నాయని డాక్టర్ సందీప్ ఛత్రజ్ తెలిపారు.



గ్రేటర్ విశాఖ 27వ వార్డు సూర్యాబాగ్‌లోని హెల్ప్ ది హెల్ప్‌లెస్ మరియు సాయిపూజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆ వార్డు మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మంది హాజరై రక్తదానం చేశారు.

# ఘనంగా పోలిపాడ్యమి దీపోత్సవం

సింహాచలం : సింహాద్రినాధుని వరాహపుష్కరణిలో మహిళలు , యువతులు అధిక సంఖ్యలో పాల్గొని పొలిపాడ్యమి, పొలిని స్వర్గంకుపంపటం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీకమాసం చివరి రోజున పోలిపాడ్యమి దీపోత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుండి మహిళలు, యువతులు, వృద్ధులు భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి దీపోత్సవాలలో పాల్గొని ఘనంగా పోలేరమ్మకు దీపాలు వదిలారు. అరటి దవ్వలోని నెయ్యిదీపాలు వెలిగించి వారి యొక్క కోర్కెలు తీర్చడానికి ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ దీపోత్సవం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని మహిళలు ప్రగాఢ విశ్వాసం. అనంతరం భక్తులు మాట్లాడుతూ రజక కుటుంబంలో పుట్టిన ఓ మహిళ భక్తిశ్రద్ధలతో దైవప్రార్థన చేస్తుండటంతో ఆమె స్వర్గానికి వెళ్లిన రోజుగా పరిగణించి కార్తీక మాసం చివర రోజైన పాడ్యమి రోజు పోలి పాడ్యమి ఉత్సవంగా ఘనంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భగవంతుని దృష్టిలో కులమత బేధాలు లేవని తెలియజెప్పేందుకు పోలిపాడ్యమి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్తీక మాసం 30 రోజులు పూజలు చేసిన మహిళలంతా పోలి పాడ్యమి రోజున చెరువుల్లో దీపాలను వదలడం ద్వారా సుఖశాంతులు చేకూరుతాయన్నారు. అదేవిదంగా అర్చకులు, వేదపండితులు మొదలగు వారంతా ఈ పోలిపాడ్యమి విశేషాలు యువతులకు వివరించారు. పెళ్లికాని యువతులు, మహిళలు, వృద్దులు



పోలిపాడ్యమి రోజున కార్తీక దీపాలు వదలడానికి వేకువజామున పుష్కరణికి చేరుకొని భక్తిశ్ర ద్ధలతో అరటిదవ్వల్లో దీపాలు వెలిగించి వదిలారు. ఈ దీపకాంతులతో వరాహ పుష్కరిణి నిండిపోయి కోటి కాంతులతో విరజిల్లింది.

# ఇగ్నో 32వ వ్యవస్థాపక దినోత్సవం

- దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి

- ఇగ్నో సేవలకు సభికుల ప్రశంసలు



విశాఖపట్నం : ఇగ్నో 32 వ వ్యవస్థాపక దినోత్సవం స్థానిక విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో ఘనం గా నిర్వహించారు. సబ్బవరం లోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రారు ఆచార్య దయానంద మూర్తి ముఖ్య అతిధిగా విచ్చేసారు. దివంగత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి తో ప్రారంభ మైన ఈ కార్యక్రమంలో మొదటగా ఇగ్నో గత ఆరేళ్లలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలను ప్రతిబింబించే వివిధ చిత్రపటాలతో ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఆచార్య మూర్తి ఆదివారం ఉదయం గంటలకు ప్రారంభించారు. ఈ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వక్రత్వ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూర్తి మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో అత్యంత విలువైన విద్యను అందిస్తున్న ఇగ్నో ని ప్రశంసించారు. ఇగ్నో సేవలు దేశంలోని మారుమూల పల్లెల్లో ఉన్నత విద్య కు నోచుకోని వారికి వరంగా పరిణమించాయని, సమాజంలోని అన్ని వర్గాల వారికి నాణ్యమైన విద్య ను అందించే ఇగ్నో అన్ని విధాలా ప్రశంసనీయమని నొక్కి వక్కాణించారు. ఉత్తరాంధ్ర జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలకు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం అందిస్తున్న సేవలు నిరుపమానమైనవని ఆయన అభినందించారు. దీంతో పాటుగా జీవితంలో పనికి వచ్చే ముఖ్యమైన సాంఘిక, శాస్త్రీయ అంశాలను కొన్నింటిని విద్యార్థులకు అవగతమయ్యేలా విశదీకరించారు. ఈ ఉత్సవానికి ప్రాంతీయ కేంద్రం సంచాలకులు, డా. ఎస్ రాజారావు అధ్యక్షత వహించారు. సహాయ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటిధర్మారావు, సహాయ రిజిస్ట్రారు ఏ. ఎల్. పి. రావు ఇతర ప్రాంతీయ కేంద్ర ఉద్యోగులు, ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్తలు, వివిధ కళాశాలల ఆచార్యులు పాల్గొన్నారు. ఈ సభలో 29 వ స్నాతకోత్సవం లో స్వర్ణ పతకం సాధించిన ఎం. శ్రీనివాసరావు పతకం అందించారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. జాతీయ గీతాలాపనతో సభను ముగించారు.



# తక్ పట్టీలను అమలు చేయాలి



నారాయణపేట : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయించిన అన్నదాతలకు వ్యాపారులు కచ్చితంగా తక్‌పట్టీల ను ఇవ్వాలని బలరామ కిసాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివవీరారెడ్డి పేర్కొన్నారు. బలరామ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఇక్కడి మార్కెట్ యార్డులో తక్‌పట్టీలపై అన్నదాతలకు అవగాహన కల్పించడం జరిగిందని, కాని క్షేత్ర స్థాయిలో మాత్రం తక్‌పట్టీల అమలు కొనసాగడం లేదన్నారు. స్థానిక యార్డులో రెండు రోజులుగా చేపట్టిన పరిశీలనలో ధాన్యం విక్రయించిన రైతులకు వ్యాపారులు తక్‌పట్టీలను ఇవ్వడం లేదని, రైతుల నుంచి అధిక కమీషన్‌ను వసూలు చేస్తూ మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధిక కమీషన్‌ను రైతుల నుంచి వసూలు చేశారనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేసి మార్కెట్‌ఛైర్మన్ బండివేణుగోపాల్‌కు అందజేశారు.

పూర్తిస్థాయిలో విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని శివవీరారెడ్డి కోరారు. దీనిపై మార్కెట్ ఛైర్మన్ బండివేణు మాట్లాడుతూ.. ఆయా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# నగర ప్రజలకు అందుబాటులోకి దంతవైద్య సేవలు

కాకినాడ: నగర ప్రజలతోపాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులకు దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని జె.జె. డెంటల్ క్లీనిక్ పాట్నర్ డా. రఘురామ్ చెప్పారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐ.డి.ఏ) కాకినాడ చాప్టర్ నూతన అధ్యక్షునిగా త్రివేణి దంత వైద్యసేవల అధినేత డా. సుజయ్ నుండి అధ్యత బాధ్యతలను స్థానిక రామ్‌కోసా భవనంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన సంఘ వార్షిక సమావేశంలో సభ్యులను ఉద్దేశించి డా. రఘురామ్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ మెడికల్ కిట్‌లను అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందని, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థతోకలిసి దంత వైద్య శిభిరాలను నిర్వ హించదలచామని చెప్పారు. తాను డా. సజయ్‌కి ఏకలవ్య శిష్యుడనని ప్రకటించుకున్నారు. ఈ సంవత్సరం హెల్త్ క్యాంప్‌లు, అవగాహనా శిభి రాలు, ఉచిత దంతవైద్య శిభిరాలను నిర్వ హించదలచామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ డెంటల్ కౌన్సిల్ ప్రతిపాదించిన సేవా కార్యక్రమాలనుకూడా నిర్వహిస్తు ఐ.డి.ఏ ప్రతిపాదించిన క్యాలెండర్ కార్యక్రమాలనుకూడా క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ప్రకటించారు. దంత వైద్యుల నుండి వచ్చే సూచనలను సిఫార్సులను కమిటీలో సమీక్షించి అమలుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఐ.డి.ఎ. సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. సతీష్ మాట్లాడుతూ కాకినాడ చాప్టర్ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగివుందని దానిని ముందుకు తీసుకు వెళ్ళడానికి కొత్తకమిటీ పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. 2018-19 సంవత్సరానికి ఎన్నికైన డా. శిరీష మాట్లాడుతూ వచ్చేనెల రాజమండ్రిలో 9,10 తేదీలలో జరగనున్న ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను విజయ వంతం చేయడానికి అందరూ సహకరించాల్సిం దిగా ఆమె కోరారు. డా. సుజయ్ మాట్లాడుతూ 2016-17 సంవత్సరంలో 25 సేవా కార్యక్రమాలు నిర్వహించడమేకాక రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహ ణకు ఆతిథ్యం ఇచ్చామని అదే విధంగా క్రీడా కార్యక్రమాలు కార్యవర్గ సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలో ప్రత్యేకతను చాటుకున్నామని చెప్పారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐ.డి.ఏ) కాకినాడ చాప్టర్ అధ్యక్షులుగా డా. రఘురామ్ ఉపాధ్యక్షులుగా డా. ముత్తా ప్రశాంత్, డా. అడ్డాల సత్యన్నారాయణ కార్యదర్శిగా డా. రవిచంద్ర, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరక్టర్‌గా డా. కృష్ణమోహన్, హెల్త్ క్యాంప్స్ విభాగ డైరక్టర్‌గా డా. సువర్ణ రాజు, ప్రత్యేక సంచిక సంపాదకులుగా డా. వివిరావు, కోశాధికారిగా డా. సిరాజ్, సంయుక్త కార్యదర్శిగా డా. గీతిక, అసిస్టెంట్ సెక్రటరీగా డా. దీప్తి, కార్యవర్గ సభ్యులుగా డా. శిరీషా జమ్మి, డా. తన్మయి, డా. పద్మావతిదేవి, ఐ.డి.ఎ. రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులుగా డా. ప్రవీణ్ రామర్స్, డా. గౌస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

## హోంగార్డులు చక్కగా పనిచేస్తున్నారు

మహబూబ్‌నగర్ : పోలీసు శాఖకు అనుబంధంగా హోం గార్డులు చక్కగా పని చేస్తున్నా రని ఎస్పీ కితాబు నిచ్చారు.









అంతాకపల్లి పంచాయితీ రావులమ్మపాలెం గ్రామ దేవత భూలోకమ్మ తల్లి పండగ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు

ఓరెలు, ప్రసాదాలు, కోళ్లు, అమ్మ వారికి వివిధ రూపాలలో భక్తులు పూజలు జరిపారు.



అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవిందు, మాజీ ఆర్‌ఇసిఎస్ డైరెక్టర్ సబ్బవరపు రాము నాయుడు, గొంప దేముడు, మేడపురెడ్డి జగన్నాధం, మరియు గ్రామ సభ్యులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా యోగానంద్ పూర్వ విద్యార్థుల కలయిక

కాకినాడ: విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల విశేష కృషికి అంకురార్పణ చేసిన స్వర్గీయ యోగానంద్ ఆశయాల అమలుకు యోగానంద్ విద్యా సంస్థలు అంకిత భావంతో పనిచేస్తున్నాయని విద్యాసంస్థల ఛైర్మన్ తమ్మన రవీంద్ర చెప్పారు. తొలిసారిగా యోగానంద్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆది వారం ఉదయం స్థానిక తిలక్‌రోడ్‌లో వున్న పాఠశాల ప్రాంగణంలో శ్రీమతి శేషారత్నం జ్యోతీ ప్రజ్వలనం చేసి ప్రారం భించారు. అనంతరం సమావేశానికి పాఠశాల ప్రిన్సి పాల్ కె. విజయ్ కుమార్ వచ్చారు

# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**





రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.




# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...



**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శు భ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.


# చిన్నారుల్లో డిప్రెషన్



ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి.

దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది.

అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఆహారాన్ని తీసుకోవడంలోనూ సమయపాలన తప్పనిసరి.

# మహిమాన్వితం.. శివగంగ ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాదుతేమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. - మహేశ్వరం

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం...:**

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.


**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/ 90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



## చిత్రభాను

# బంకర్‌లో నాలుగు రోజులు ఉన్నాను!

గత రెండేళ్లుగా వరుస సినిమాలతో తీరికలేకుండా వున్నాను. ఒక్క నెలరోజులైనా విశ్రాంతి తీసుకుందామంటే కుదరడం లేదు అని అంటున్నది పంజాబీ సోయగం రకుల్‌ప్రీత్‌సింగ్. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో ఈ అమ్మడు దూకుడు మీదుంది. భారీ చిత్రాల అవకాశాల్ని కైవసం చేసుకుంటూ రేసులో దూసుకుపోతున్నది. అనతికాలంలోనే తారాపథంలో తనకంటూ ప్రత్యేకతను స ృష్టించుకోవడం అమితానందాన్ని కలిగిస్తున్నదని, ఇదే జోరును మున్ముందు కూడా కొనసాగిస్తాననే నమ్మకం వుందని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆమె కార్తి సరసన కథానాయికగా నటించిన ఖాకీ చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా రకుల్‌ప్రీత్‌సింగ్ పాత్రికేయులతో సంభాషించింది.

ఈ ఏడాది నేను నటించిన చిత్రాల్లో ఖాకీ ఉత్తమ సినిమా అని అందరు అభినందిస్తున్నారు. కమర్షియల్ సినిమాలో ఓ సరికొత్త ప్రయోగమిది. 1995 నుంచి 2005వరకు జరిగిన యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పరిశోధనాత్మక కథాంశంతో ఆద్యంతం ప్రేక్షకుల్ని ఉత్కంఠతకు గురిచేస్తుంది. ప్రతి సన్నివేశం సహజంగా, వాస్తవాన్ని కళ్లముందు ఆవిష్కరిస్తున్నట్లుగా అనిపిస్తుంది. కేవలం క్రైమ్ కథల్ని ఇష్టపడేవారికి మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకుల్ని సైతం ఈ సినిమా ఆకట్టుకుంటున్నది. ఈ మధ్యే ప్రేక్షకుల మధ్య సినిమా చూశాను. ఎండ్ టైటిల్స్ పూర్తయ్యే వరకు ఎవరూ థియేటర్‌ని వదలి వెళ్లలేదు. సినిమాలోని ఉద్వేగాలు ప్రేక్షకుల్ని అంతలా కట్టిపడేస్తున్నాయి.

**మధ్య తరగతి యువతికి ప్రతీకలా..**

సినిమాలో నేను పోషించిన ప్రియ పాత్ర ప్రతి ఒక్క మధ్యతరగతి అమ్మాయికి కనెక్ట్ అవుతున్నది. కెరీర్‌లో తొలిసారి ఇలాంటి పాత్ర చేశాను. దర్శకుడు వినోద్ రొమాంటిక్ సన్నివేశాల్ని హ ృద్యంగా తీర్చిదిద్దాడు. కార్తీ, నాకు మధ్య వచ్చే ప్రణయఘట్టాలు పొయెటిక్‌గా వున్నాయని ప్రశంసిస్తున్నారు. ప్రియ పాత్రకు ఎలా న్యాయం చేయాలో అని ముందుగా ఆలోచించలేదు. ఆ పాత్రలోని ఏవో



తెలియని భావోద్వేగాలు నన్ను ముందుకు నడిపించాయి. కథలో నవ్యత వుంటే పాత్రలు కూడా బాగా రాణిస్తాయని ఖాకీ చిత్రం నిరూపించింది.

**సైనికుల జీవితాన్ని ప్రత్యక్షంగా చూశాను**

మా నాన్న సైనికాధికారి కావడంతో నాకు చిన్నతనం నుంచే మిలటరీ వారి జీవితాల్ని దగ్గరగా పరిశీలించే అవకాశం కలిగింది. మా నాన్నతో కలిసి రాజస్థాన్‌లోని పాకిస్థాన్ సరిహద్దు వరకు వెళ్లాను. అక్కడి బంకర్‌లో నాలుగైదురోజులు గడిపిన అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. నాన్నతో కలిసి చేసిన ప్రయాణంలో ఎన్నో ఘటనల్ని చూశాను. టెర్రరిస్టులను మొదలుకొని తుపాకీ కాల్పుల్ని కూడా దగ్గరి నుంచి చూశాను. దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో సైనికులు ఎలాంటి కష్టాలు పడతారో నాకు తెలుసు. జాతీయ గీతం వస్తే రెండు నిమిషాలు నిలబడటానికే కొందరు బద్ధకిస్తున్నారు. అలాంటిది సైనికులు పగలూరాత్రి అనే తేడాలేకుండా రోజంతా నిలబడే విధులు నిర్వర్తిస్తున్నారు. వారి కష్టం గురించి ప్రతి ఒక్కరు ఆలోచించాలి.

**కార్తీ ప్రయోగాల్ని ఇష్టపడతారు**

దక్షిణాది కథానాయకుల్లో కార్తీది విలక్షణ శైలి. ఆయన కమర్షియల్ సినిమాలో కూడా ప్రయోగాల్ని ఇష్టపడతారు. పాత్రలపరంగా ప్రతి సినిమాలో వైవిధ్యాన్ని కనబరచడానికి ప్రయత్నిస్తారు. ఆయనతో కలిసి నటించడం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నా నటనను మరింతగా మెరుగు పరచుకునేందుకు దోహదపడింది. ప్రస్తుతం ఆయనతో మరో సినిమా అంగీకరించాను.

**4ఏళ్లు..15 సినిమాలు..**

ఇతర కథానాయికలు మీ స్పీడ్‌ను అందుకోలేక పోతున్నారనే ప్రశ్నకు రకుల్‌ప్రీత్‌సింగ్ స్పందిస్తూ..అలాంటిదేమి లేదు. పరిశ్రమలో ప్రతిభకు తగిన అవకాశాలొస్తుంటాయి. భారీ చిత్రాల్లో వరుస అవకాశాలు రావడం అద ృష్టంగా భావిస్తున్నాను.

గత నాలుగేళ్లలో దాదాపు 15 సినిమాలు చేశాను. విరామం లేకుండా పనిచేస్తున్నాను. ఈ మధ్య ఒక నెలరోజులు విశ్రాంతి తీసుకోమని నా కుటుంబ సభ్యులు చెప్పారు. షూటింగ్‌ల బిజీతో అది కుదరడం లేదు.

ఎంత తీరిక లేకుండా వున్నా నాకు నచ్చిన కథల్ని ఎప్పుడూ వదులుకోను. నా క్యారెక్టర్ ఎక్సైయిటింగ్‌గా అనిపిస్తే ఎంత కష్టమైనా డేట్స్ సర్దుబాటు చేసుకుంటాను. భవిష్యత్తులో పాత్రలపరంగా ప్రయోగాలు చేయాలని వుంది. అయితే పూర్తిస్థాయి మహిళా ప్రధాన చిత్రాల్లో నటించడానికి ఇంకాస్త సమయం పడుతుందని భావిస్తున్నాను. నటిగా మరింత పరిణితి సాధిస్తేనే లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు న్యాయం చేయగలుగుతాం. ఒక సినిమా కథను సింగిల్‌గా హ్యాండిల్ చేసేంత శక్తి నాకు లేదనుకుంటున్నాను. ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో రెండేసి చిత్రాలను అంగీకరించాను. హిందీలో నీరజ్‌పాండే దర్శకత్వంలో ఐయారీ చిత్రంలో నటిస్తున్నాను. క్రైమ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. నీరజ్‌పాండే దర్శకత్వ శైలిని నేను అభిమానిస్తాను. ఐయారీ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందనే నమ్మకం వుంది.

**అరబ్ తరహా కఠిన చట్టాలు రావాలి**

మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై రకుల్‌ప్రీత్‌సింగ్ స్పందిస్తూ..మహిళలపై అఘాయిత్యాల్ని అరికట్టాలంటే ఇప్పుడున్న చట్టాలు సరిపోవు. మరింత కఠిన చట్టాలు రావాలి. అత్యాచారాలకు పాల్పడే వారిని బహిరంగంగా శిక్షించాలి.

అప్పుడే సమాజంలో కొంతైనా మార్పు వస్తుంది. అరబ్ దేశాల తరహాలో అత్యాచారం చేసిన వారికి అత్యంత కఠినమైన శిక్షలు విధించాలి. లైంగిక వేధింపులు ప్రతి రంగంలో వుంటాయి. సినీరంగం అంటే ఆకర్షణ ఎక్కువ కాబట్టి అలాంటి వార్తలు త్వరగా బయటికి వస్తాయి. వ్యక్తిగతంగా నాకు పరిశ్రమలో ఎలాంటి వేధింపులు ఎదురుకాలేదు. నా అద ృష్టం కొద్దీ ఇప్పటి వరకు అందరూ మంచి మనసున్న వారే పరిచయమయ్యారు. ప్రతిభ, కష్టపడేతత్వాన్ని నమ్ముకొని పరిశ్రమలో ఎదుగుతున్నాను.

# త్రిష, శింబు, వడివేలుపై వేటు?



నిర్మాతలను నష్టాలకు గురిచేశారనే ఆరోపణలపై తమిళ అగ్ర నటులు శింబు, త్రిష, వడివేలుపై మూడేళ్ల వేటు పడే అవకాశం ఉన్నట్టు కనిపిస్తున్నది. నిర్మాతలు తీవ్రంగా నష్టపోవడానికి కారణమయ్యారనే అంశంపై తమిళ నిర్మాతల మండలి కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నది. విజయ్ ఆంటోని నటించిన అన్నాదురై ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో ఇటీవల తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజా వీరిపై ధ్వజమెత్తడం వివాదంగా మారిన సంగతి తెలిసిందే. వీరిపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నిర్మాతల మండలి చర్యలు తీసుకోవడానికి సిద్ధపడుతున్నట్టు సమాచారం. హీరో (శింబు) 29 రోజులు షూటించే చేస్తే దాదాపు ప్రతీ రోజు సెట్‌కు లేటుగా వచ్చేవాడు. కేవలం మొక్కుబడిగా నాలుగు గంటలు షూటింగ్‌లో ఉండి వెళ్లిపోయేవాడు. షూట్ చేసిన 30 శాతంతోనే సినిమాను రిలీజ్ చేద్దాం అని ఒత్తిడి చేశాడు. నా సినీ జీవితంలో ఎంతో అంకితభావం చూపే యాక్టర్లను చూశాను. నా జీవితంలో అలాంటి నటుడిని ఇంత వరకు చూడలేదు. మైఖేల్ రాయప్పన్ అనే నిర్మాత 18 కోట్లు నష్టపోవడానికి ఓ హీరో (శింబు) కారణమయ్యాడు అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు. విక్రమ్ నటిస్తున్న సామీ2 చిత్రం నుంచి ఉన్నపళంగా హీరోయిన్ త్రిష వైదొలగడంతో తాను నష్టపోయాను అని నిర్మాత మండలికి ప్రొడ్యూసర్ ఫిర్యాదు చేశారు. క్రియేటివ్ డిఫెరెన్స్





కారణంగా త్రిష తాను నటించనని ఆ సినిమాను నుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. ఇమ్‌సాయి అరసన్ అనే చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రంలో నటించడానికి వడివేలు అంగీకరించాడు.

ఆ తర్వాత నిర్మాత, రోబో2 దర్శకుడు శంకర్‌తో విభేదాలు రావడంతో ఆ సినిమా ఆగిపోయింది. దాంతో తాను కొంత మొత్తం నష్టపోయాను అని నిర్మాత శంకర్ ఫిర్యాదు చేశారు.

# ముగ్గురు స్వలింగ సంపర్కులు.. వర్మ నీచమైన కామెంట్..





దర్శకుడు రాజమౌళి, హీరోలు రాంచరణ్, ఎన్టీఆర్‌పై సోషల్ మీడియాలో రాంగోపాల్ వర్మ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. రాంచరణ్, ఎన్టీఆర్, రాజమౌళి దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్వలింగ సంపర్కులు అంటూ నీచమైన కామెంట్ చేయడంపై రాంగోపాల్ వర్మపై నెటిజన్లు మండిపడుతున్నారు. రాజమౌళి, రాంచరణ్, ఎన్టీఆర్ ఫొటోపై రాంగోపాల్ వర్మ తన తొలి పోస్టులో ఈ విధంగా కామెంట్ చేశారు.

నాకు మహిళలంటే అమితమైన గౌరవం ఉంది. వారిని బాగా ఆరాధిస్తాను. ఇలా స్వలింగ సంపర్కుల సంస్క ృతి (గే కల్చర్)ని బాహాటంగా ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అంటూ ఫేస్‌బుక్‌లో వర్మ పోస్ట్ చేశాడు. వర్మ కామెంట్‌పై ఓ నెటిజన్ స్పందిస్తూ.. నీ కూతురును కూడా పంపించూ.. అప్పుడు అది గ్యాంగ్ బ్యాంగ్ కల్చర్ అవుతుంది అని షాక్ ఇచ్చాడు.

# భయపడితే చచ్చినట్టే.. ప్రకాశ్ రాజ్

ప్రకాశ్ రాజ్ విలక్షణ నటుడు. సినిమాలపైనే కాకుండా సమాజంపైనా అమితమైన ప్రేమ ఉంటుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని జస్ట్ ఆస్కింగ్ పేరుతో నిలదీస్తున్నాడు. గౌరీ లంకేష్, జీఎస్టీపై ఆయన ప్రశ్నించడం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ ప్రముఖ టెలివిజన్ చానెల్‌తో మాట్లాడుతూ.. నేను జాతి వ్యతిరేకిని కాను. ప్రభుత్వాల పనితీరును నేను ప్రశ్నిస్తున్నాను అంతే కాని ఎవరిని టార్గెట్ చేయడం లేదు అని అన్నారు. ప్రకాశ్ రాజ్ వెల్లడించిన విషయాలు ఆయన మాటల్లోనే. అట్టడుగు సమాజం నుంచి ఓ స్థాయికి చేరుకొన్న నాకు సొసైటీలో జరుగుతున్న అన్యాయాన్ని పశ్నించకపోతే నేను పిరికివాడిని అవుతాను. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిని నేను. ఈ సొసైటీలో జీవిస్తున్నాను. టాక్స్ కడుతున్నాను. దేశానికి సేవ చేస్తున్నాను. ఇన్ని రకాల బాధ్యతలు నిర్వర్తిస్తున్న పౌరుడిగా ప్రశ్నించడంలో తప్పేమీ లేదు. గౌరీ లంకేష్ హత్యపై తీవ్రంగా స్పందించాను. ఎందుకంటే నాకు చాలా సన్నిహితురాలు. గౌరీ తండ్రి లంకేష్ ఎలాంటి వ్యాపార ప్రకటన లేకుండా ఓ పత్రికను నడిపిన వ్యక్తి. ఆయన నాకు స్ఫూర్తి. ఆయన నాకు ఒకటే చెప్పేవాడు. నీ ఫ్రెండ్ అధికారంలో ఉన్నా సరే.. నీవు ప్రశ్నించడానికి ప్రతిపక్షంగా మారు. అప్పుడే సమాజానికి మంచి జరుగుతుంది అని లంకేష్ చెప్పాడు. చావు నా గడప ముందు కనిపించినందునే నేను ప్రశ్నించాల్సి వచ్చింది. గౌరీ లంకేష్ హత్యను కొందరు వేడుకగా జరుపుకుంటే నాకు బాధేసింది. పన్సేరే హత్య గానీ, కేరళలో బీజేపీ కార్యకర్తల హత్యలు గానీ నాకు నచ్చడం లేదు. ఎవరైనా సరే హత్య చేయడాన్ని వ్యతిరేకిస్తాను. నేను ఓటు వేయకపోయినా నాకు ప్రధాని మోదీనే. నేను ప్రశ్నించడం మోదీకి వ్యతిరేకం కాదు.

# నంది అవార్డుపై జగపతిబాబు కామెంట్



రక్తదానం చేయడంపై అందరూ ద ృష్టిపెట్టాలి అని విలక్షణ నటుడు జగపతిబాబు అన్నారు. రోగులకు, ప్రమాదానికి గురైన వారు సరైన సమయంలో రక్తం అందకపోవడంతో చనిపోయారు అని చాలా సార్లు విన్నాను. అందుకే ఎన్టీఆర్, బసవతారక క్యాన్సర్ హాస్పిటల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న అనంతరం జగపతిబాబు మీడియాతో మాట్లాడారు. దేవుడు ఎక్కడ ఉన్నారు అని అందరూ అని అడుగుతుంటారు. నన్నడిగితే సరైన సమయంలో ఆపదలో ఉన్నవారికి రక్తం అందించే వ్యక్తి, దానం చేసే వ్యక్తి దేవుడు అని నేను నమ్ముతాను అని జగపతి అన్నారు.

ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సమాజ సేవ కోసం ఆలోచించి రక్తదానం అందిస్తే సాటి మనిషి ప్రాణాలు నిలబెట్టే దేవుడి అవుతాం అని జగపతి బాబు చెప్పారు.

లెజెండ్ విలన్ పాత్ర పోషించాను. ఇప్పుడు నేను రక్తదానం చేస్తున్నాను. నేను మంచివాడినా లేదా చెడ్డవాడినా అనేది మీరే చెప్పాలి. రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నారని తెలిసి వచ్చి బ్లడ్ డొనేట్ చేశాను. అందరూ చేయాల్సిన అవసరం ఉంది.

నా మొదటి సినిమా సింహస్వప్నం. ఆ సినిమా మూడు రోజులు ఆడింది. నేను విలన్‌గా చేసిన చిత్రం లెజెండ్ మూడు సంవత్సరాలు ఆడింది. విలన్ ఆ చిత్రంలో చేసిన పాత్రకు నాకు నంది అవార్డు లభించింది. ఆ పాత్రకు మంచి పేరు కూడా వచ్చింది.

నంది అవార్డులు వివాదంగా మారడంపై నేను కామెంట్ చేయబోను. అది మీడియా, జ్యూరీకి సంబంధించిన విషయం. దానిపై మీరే తేల్చుకోవాలి అని జగపతిబాబు చమత్కరించారు.

# శ్రీలంక 294 ఆలౌట్



కోల్‌కతా: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఓపెనర్లు కదం తొక్కారు. తొలి ఇన్నింగ్స్‌లో ఘోరంగా విఫలమైన ఈ జోడీ రెండో ఇన్నింగ్స్‌లో లంక బౌలర్లను ఓ ఆట ఆడుకున్నారు. తొలుత రాహుల్ హాఫ్ సెంచరీ సాధించగా, ఆపై ధావన్ సైతం అర్ధ శతకం నమోదు చేశాడు. కేఎల్ రాహుల్ ఆడిన గత తొమ్మిది ఇన్నింగ్స్ ల్లో ఎనిమిదో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో రాహుల్ డకౌట్ కాగా.. రెండో ఇన్నింగ్స్ లో అర్ధ శతకంతో చెలరేగాడు. ఇది రాహుల్ కు టెస్టుల్లో 10వ హాఫ్ సెంచరీ.

జట్టు స్కోర్ 166 పరుగుల వద్ద శిఖర్ ధావన్ 94 ( 116 బంతులు 11ఫోర్లు, 2 సిక్సులు) దాసున్ షనక బౌలింగ్‌లో క్యాచ్ అవ్వటై తృటిలో శతకం చేజార్చుకున్నాడు. దీంతో తొలి వికెట్‌కు నమోదైన166 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన చతేశ్వర పుజారాతో రాహుల్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్‌ను 15 నిమిషాల ముందే ముగించారు. ఇక నాలుగో రోజు ఆటముగిసే సరికి వికెట్ నష్టపోయి భారత్ 171 పరుగుల చేసి 49 పరుగుల ఆధిక్యం సాధించింది. క్రీజులో రాహుల్(73 నాటౌట్),పుజారా(2 నాటౌట్)లు ఉన్నారు.


అంతకుముందు శ్రీలంక జట్టు తన తొలి ఇన్నింగ్స్ లో 83.4 ఓవర్లలో 294 పరుగుల వద్ద ఆలౌటైంది. 165/4 ఓవర్ నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక.. మరో 35 పరుగులు జోడించిన తరువాత డిక్ వెల్లా(35) వికెట్ ను కోల్పోయింది. అటు స్వల్ప వ్యవధిలో ఆపై దాసున్ షనక(0), చండిమాల్ (28)సైతం అవుటయ్యారు ఈ మూడు వికెట్లు పరుగు వ్యవధిలో కోల్పోవడంతో అప్పటి వరకూ పటిష్ట స్థితిలో కనిపించిన లంక ఒక్కసారిగా కష్టాల్లో పడింది. ఈ తరుణంలో రంగనా హెరాత్ బాధ్యతాయుతంగా ఆడాడు. 105 బంతుల్లో 9 ఫోర్ల సాయంతో 67 పరుగులు జోడించాడు. తొమ్మిదో వికెట్ కు 46 పరుగులు జోడించిన తరువాత హెరాత్ పెవిలియన్ చేరాడు. భారత బౌలింగ్‌లో భువనేశ్వర్, షమీలకు నాలుగు వికెట్లు దక్కగా.. ఉమేశ్ యాదవ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

# మాజీ ప్రధాని కుమారుడు కన్నుమూత



ఖాట్మండు: నేపాల్ మాజీ ప్రధానమంత్రి, సీపీఎన్ మావోయిస్ట్ సెంటర్ చైర్మన్ పుష్ప కమల్ దహాల్ కుమారుడు ప్రకాష్ దహాల్ ఆదివారం నాడిక్కడ గుండెపోటుతో కన్నుమూశారు. దహాల్‌కు ప్రకాష్ ఒక్కడే కొడుకని, తెల్లవారుజామున 4 గంటలకు గుండెపోటు రావడంతో నోర్విక్ ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించారని, అయితే అప్పటికే ఆయన కన్నుమూసినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఖాట్మండు పోస్ట్ తెలిపింది. 36 ఏళ్ల ప్రకాశ్ తన తండ్రికి ప్రైవేటు సెక్రటరీగా ఉండటమే కాకుండా పార్టీ సెంట్రల్ మెంబర్‌గా కూడా ఉన్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు, పలువురు పిల్లలు ఉన్నారు. కుమారుని మరణ వార్త తెలిసిన వెంటనే జఫా జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన పుష్ప కమల్ దహాల్ హుటాహుటిన ఖాట్మండు చేరుకున్నారు. కాగా, ప్రకాష్ మృతి పట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

# మహిళా విద్యార్థినులకు షాక్




ధర్భంగా : గర్ల్స్ హాస్టల్‌లో జూనియర్ విద్యార్థినులపై ర్యాంగింగ్‌కు దిగిన సీనియర్ విద్యార్థినులపై దర్భంగా మెడికల్ కాలేజ్ తీవ్ర చర్యలు తీసుకుంది. ర్యాగింగ్‌లో పాల్గొన్న మొత్తం 54 విద్యార్థినులపై రూ. 25 వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని నవంబర్ 25 లోపు చెల్లించాలని, లేకపోతే ఆరు నెలల పాటు వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని యాంటి ర్యాగింగ్ కమిటీ నోడల్ ఆఫీసర్ రాధారమణ్ ప్రసాద్ సింగ్ స్పష్టం చేశారు.

కాలేజ్‌లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే రూ. 25 వేల నుంచి లక్ష రూపాయల వరకూ జారిమానా విధించవచ్చని ఆయన చెప్పారు. మొదటిసారి సాధారణ జరిమానా విధించామన్న ఆయన.. మరోసారి ఇటువంటి ఘటనలు జరిగితే పరిణాలు తీవ్రంగా ఉంటాయని చెప్పారు. ఈ నెల 11న కొత్తగా చేరిన విద్యార్థులను సీనియర్లు హాస్టల్‌లో ర్యాగింగ్ చేసినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

## భారతీయుల నల్లధనంపై
# స్విస్ ప్యానెల్ సంచలన నిర్ణయం

బెర్నే : భారతీయుల స్విస్ బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు భారత ప్రభుత్వం తెలుసుకునేందుకు మార్గం సుగమమైంది. ఇరు దేశాలు సమాచారాన్ని ఆటోమేటిక్‌గా ఇచ్చిపుచ్చుకునేందుకు స్విట్జర్లాండ్ పార్లమెంటరీ కమిటీ ఆమోదం తెలిపింది. స్విట్జర్లాండు పార్లమెంటులోని ఎగువ సభకు చెందిన ఆర్థిక వ్యవహారాలు, పన్నుల కమిషన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భారతదేశంతోపాటు మరో 40 దేశాలతో స్విట్జర్లాండ్ కుదుర్చుకున్న ఇటువంటి ఒప్పందాలను ఆమోదించింది. అయితే వ్యక్తిగత లీగల్ క్లెయిములకు రక్షణను పటిష్టపరచాలని సలహా ఇచ్చింది. ఈ సిఫారసులను ఈ నెల 27న జరిగే స్విస్ పార్లమెంటులోని ఎగువ సభ కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ ఆమోదించవలసి ఉంది. దీనికి ఆమోదం లభిస్తే స్విస్ బ్యాంకుల్లో డబ్బు పోగేసుకునేవారి వివరాలు భారత ప్రభుత్వం పొందగలుగుతుంది. బ్యాంకు ఖాతాదారు పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్, వడ్డీ, డివిడెండ్, బీమా పాలసీల నుంచి వచ్చిన సొమ్ము, క్రెడిట్ బ్యాలెన్స్ వంటి వివరాలను ప్రభుత్వం తెలుసుకోవచ్చు.

# ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఆధార్ వివరాల తొలగింపు

● ప్రాథమిక హక్కులకు భంగం ● సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు



దిల్లీ: కొందరు లబ్ధిదారుల పేర్లు, వివరాలను ఆధార్ సంఖ్య సహితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 210 వెబ్‌సైట్లలో బహిరంగంగా ప్రదర్శించారని యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) వెల్లడించింది. నిబంధనలను ఉల్లంఘించి ప్రదర్శించిన ఆ సమాచారాన్ని వెబ్‌సైట్ల నుంచి పూర్తిగా తొలగించినట్టు సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు స్పందించింది. కాగా ఉల్లంఘన ఎప్పడు జరిగిందో, ఎప్పుడు సమాచారాన్ని తొలగించారో మాత్రం వెల్లడించలేదు.

పన్నెండు అంకెల ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యను యూఐడీఏఐ జారీ చేస్తుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము ప్రవేశపెట్టిన పథకాల ప్రజయోనాలు పొందాలంటే లబ్ధిదారులకు ఆధార్‌ను తప్పనిసరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉండటం లేదని, ఇది ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందని కొందరు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న వ్యక్తిగత సమాచారం గోప్యంగా, సమగ్రంగా, భద్రంగా ఉంటుందని యూఐడీఏఐ స్పష్టం చేసింది. వ్యక్తుల వివరాలు ప్రదర్శించకుండా ఉండేలా కఠినమైన నిబంధనలు ఉన్నాయని తెలిపింది.

# పెరగనున్న హాయర్ ఏసీ, ఫ్రిజ్ ధరలు

న్యూఢిల్లీ: ప్రముఖ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ హాయర్ ఇండియా రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల ధరలను పెంచింది. ఈ ధరల పెంపు 12శాతం వరకూ ఉంటుందని తెలిపింది. ముడి వస్తువుల ధరలు పెరగడం వల్లే వస్తువుల ధరలను పెంచినట్లు తెలిపింది. కేవలం ముడి సరకు ధరలు పెరిగినందువల్లే పెంపు నిర్ణయం తీసుకున్నాం. దీపావళికి ముందే పెంచుదామని నిర్ణయించినా, మార్కెట్ పరిస్థితి దృష్ట్యా ముందడుగు వేయలేదు. అయితే ధరల పెంపు జాబితా పెద్దదేమీ కాదు. వచ్చే వారం నుంచి పెంచిన ధరలు అమల్లోకి వస్తాయి అని హాయర్ ఇండియా అధ్యక్షుడు ఎరిక్ బ్రగంజా తెలిపారు.

రిఫ్రిజిరేటర్ల ధరలు 5-6శాతం పెరుగుతాయని ఏసీల ధరలు రెండంకెల సంఖ్యకు.. అంటే 10-12శాతం పెంచుతున్నట్లు వెల్లడించారు. హాయర్ ఇటీవలే పుణెలో అదనపు ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.

## సెప్టెంబర్‌లో రూ.74,090 కోట్ల
# కార్డు లావాదేవీలు



ముంబయి: పెద్ద నోట్ల రద్దు ఫలితాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్‌లో డెబిట్, క్రెడిట్ కార్డుల లావాదేవీలు రూ.74,090 కోట్లకు పెరిగాయి. గతేడాది ఇదే సమయంలో ఇది రూ.40,130 కోట్లు. అప్పటితో పోలిస్తే 84 శాతం పెరుగుదల నమోదైందని ఐరోపా చెల్లింపు సేవల సంస్థ వరల్డ్‌లైన్ అధ్యయనం వెల్లడించింది. నోట్ల రద్దు, ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే అందుకు కారణమని తెలిపింది.

సెప్టెంబర్‌లో అన్ని పీఓఎస్ యంత్రాల వద్ద 37.8 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. గతేడాది ఇవి 20.3 కోట్లుగా ఉన్నాయి. అంటే 86 శాతం వృద్ధి కనిపించింది. నోట్ల రద్దు తర్వాత ప్రతి కొనుగోలుకు ప్రజలు డిజిటల్ లావాదేవీలు చేశారు. తిరిగి పూర్తిస్థాయిలో నగదు చలామణిలోకి వచ్చినా కార్డు లావాదేవీల్లో వృద్ధి కనిపించిందని వరల్డ్‌లైన్ దక్షిణాసియా ప్రతినిధి దీపక్ చంద్నాని తెలిపారు. జన్‌ధన్‌యోజన ఖాతాల వల్ల కార్డుల వినియోగం బాగా పెరిగిందని పేర్కొన్నారు. 2017 సెప్టెంబర్ నాటికి మొత్తం కార్డుల సంఖ్య 85.3 కోట్లు కాగా అందులో 3.33 కోట్లు క్రెడిట్‌కార్డులు. 81.9 కోట్లు డెబిట్ కార్డులు.

2011 నుంచి 2016 మధ్య కాలంలో క్రెడిట్ కార్డుల వృద్ధి 9 శాతంగా ఉండగా 2016-17కు 24 శాతంగా ఉంది.

నోట్ల రద్దు తర్వాత గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్‌కు డిజిటల్ లావాదేవీల్లో 31 శాతం పెరుగుదల ఉందని ఆర్‌బీఐ చెప్పిన సంగతి తెలిసిందే. డిజిటల్ చెల్లింపుల రంగంలో నోట్ల రద్దు ముందు వృద్ధిరేటు 20-50 శాతం ఉండగా ఆ తర్వాత 40 శాతానికి పెరిగింది. ఒక ఒక్కనెల్లోనే యూపీఐ ఆధారిత లావాదేవీలు 85 శాతానికి ఎగిసిన సంగతి తెలిసిందే.




# భారత్ మరో ఘనత!

## తలసరి జీడీపీ గణాంకాల్లో మెరుగుపడిన స్థానం

న్యూఢిల్లీ: భారత్ వృద్ధి పథంలో పయనిస్తోంది. అమెరికా, చైనా వంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలకు దీటుగా ఎదుగుతోంది. సులభతర వ్యాపారంలో 100వ స్థానంలో నిలిచిన భారత్.. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది. తలసరి స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) గణాంకాల ప్రకారం టాప్ 200 దేశాల్లో భారత్ 126వ స్థానంలో నిలిచింది. అయితే బ్రిక్స్ దేశాలతో పోలిస్తే ఇంకా వెనకబడే ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) విడుదల చేసిన గణాంకాల ప్రకారం అత్యంత ధనిక దేశంగా ఖతార్ నిలిచింది. కొనుగోలు శక్తి ప్రాధాన్యం(పీపీపీ) ఆధారంగా ఐఎంఎఫ్ జీడీపీని గణించింది.

గతేడాది భారత తలసరి జీడీపీ 6,690 డాలర్లు ఉండగా, తాజాగా 7,170 డాలర్లకు చేరడం ద్వారా భారత ర్యాంకు మెరుగుపడింది. ఇదే సమయంలో ఖతార్ తలసరి జీడీపీ 1,24,930 డాలర్లతో మొదటిస్థానంలో, మకావు 1,14,430 డాలర్లతో రెండో స్థానంలోనూ ఉండగా, లక్సెమ్‌బర్గ్ 1,09,190 డాలర్లతో మూడో స్థానంలో నిలిచింది. బ్రిక్స్ దేశాల్లో భారత్‌దే అతి తక్కువ తలసరి జీడీపీ కావడం గమనార్హం. రష్యా తలసరి జీడీపీ 27,900 డాలర్లు, చైనా 16,620 డాలర్లు, బ్రెజిల్ 15,550 డాలర్లు, దక్షిణాఫ్రికా 13,400 డాలర్లతో ఉన్నాయి.

క్రెడిట్ స్యుసి నివేదిక ప్రకారం భారత్‌లో 2.45లక్షల మంది మిలియనీర్ల మొత్తం సంపద 5 ట్రిలియన్ డాలర్లు కావడం గమనార్హం.ఐఎంఎఫ్ విడుదల చేసిన తలసరి జీడీపీ గణాంకాల ప్రకారం సింగపూర్(4), బ్రూనే(5), ఐర్లాండ్(6), నార్వే(7), కువైట్(8), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(9), స్విట్జర్లాండ్(10)లు టాప్ టెన్‌లో నిలిచాయి. అయితే అగ్ర రాజ్యం అమెరికా మొదటి పది స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోయింది. ఆ దేశ తలసరి జీడీపీ 59,500 డాలర్లతో 13వ స్థానంలో ఉండగా, యూకే అంతకన్నా దిగువగా ఉండటం గమనార్హం.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com